అలీబాబా 40 దొంగలు

అజీజ్

"చెల్లాయ్!" పిల్చాడు కిరణ్.

"అన్నయ్యా!" అంటూ వచ్చింది జ్యోతి.

"కారు డ్రైవర్ కావాలని పత్రికల్లో ప్రకటిస్తే అనేక అప్లికేషన్స్ వచ్చాయి. వాటిలో నాలుగు సెలక్టు చేసి, ఈ రోజు ఇంటర్వ్యూకు రమ్మని కబురంపాను. ఉదయం పదవుతోంది. అవతల నేను అత్యవసర మీటింగ్ అటెండ్ కావాలి. ఆ ఇంటర్వ్యూ సంగతేదో నువ్వే చూడు" అంటూ చకచక బైటికి నడిచాడు కిరణ్.

జ్యోతి నెమ్మదిగా వెళ్ళి, హాలు పక్క ఆఫీస్ రూంలో కూర్చుంది. పదిన్నర దాటాక వచ్చి చెప్పాడు నౌఖరు ఇంటర్వ్యూ కోసం అభ్యర్థులు వచ్చారని.

"ఎంతమంది?" అడిగింది జ్యోతి.

"ఇద్దరేనమ్మా!"

"నలుగుర్ని రమ్మంటే ఇద్దరే వచ్చారా! మంచిదే. నాకూ తలనొప్పి తగ్గుతుంది. ముందు వచ్చిన వ్యక్తిని

పంపు లోపలికి."

నౌఖరు వెళ్ళిన రెండు నిమిషాల తరవాత, స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుంటూ లోనికి వచ్చాడో యువకుడు. పళ్ళికిలించి, "నా పేరు పచ్చిపులుసు పీతాంబరమండి. తండ్రి పచ్చిపులుసు ఏకాంబరం, తల్లి నాంచారమ్మలకు పుట్టిన ఏకైక నలుసుని. వయసు ముప్పై, బరువు యాభై, పొడవు మూడడుగుల ఐదంగుళాలు.... సారీ.... ఐదడుగుల మూడంగుళాలు. పొట్టివాణ్ణయినా కారు తోలడంలో గట్టివాణ్ణే!

ఎంతటి ఘోరమైన ఆక్సిడెంట్ జరిగినా చెక్కు చెదరను. ఏదేళ్ళ హెవీలైసెన్స్‌తో, పదేళ్ళ ప్రత్యేకానుభవంతో మీ వద్దకు వచ్చాను ఉద్యోగార్థం!" అన్న అతని వాగ్ధాటికి ఖంగుతిని, వెంటనే తేరుకుంది జ్యోతి.

"అయ్యో, ఏకాంబరం!"

"పీతాంబరమండి!"

"ఏదో ఒక అంబరంగానీ నువ్వు నడుపుతున్న జీపు ప్రమాదకరమైన ఘాట్ రోడ్ మీంచి కిందికి వస్తోందనుకో. ఏకాస్త పొరపాటు జరిగినా అది రోడ్డు పక్క అగాధంలోకి దొర్లి పోతుంది. ఆ స్థితిలో హఠాత్తుగా జీపు బ్రేకులు ఫేలయ్యాయి. అదే క్షణంలో ఓ అందమైన అమ్మాయి రోడ్డెక్కుతూ అడ్డం వచ్చింది. అప్పుడేం చేస్తావు నువ్వు?"

"వెంటనే జింకలా జీపులోంచి దూకి ఆ అమ్మాయిని కాపాడతాను."

"అంటే, జీపును వల్ల కాట్లో వదిలేశా?"

"డబ్బు తగలేస్తే అలాంటి లక్షాల్లొంభై జీపులు దొరుకుతాయిగానీ, అంత అందమైన అమ్మాయి ఎక్కడ

దొరుకుతుందండీ?"

"నీ దృష్టిలో యజమాని జీపుకన్నా, అందమైన అమ్మాయే మిన్న అన్నమాట!"

"అంతే కదండి.... హిహిహీ!"

"మా క్కావలసింది ప్రాణంకన్నా ప్రియంగా మా కారు చూసుకునే డ్రైవరు. నీలాటి అమ్మాయిల పిచ్చి ఉన్న పచ్చిపులుసు పీ తాం బ రా లు కాదు. వెళ్ళరా బాబూ!"

"అది కాదండి....మరే....మరే...."

"ఏ సంగతీ తరవాత తెల్పుతాం! ముందు బైటికెళ్ళి, ఆ రెండో అతన్ని పంపు."

బిక్క మొహంతో ఫైలందుకుని, బైటికి నడిచాడు పీతాంబరం.

రెండు నిమిషాల తరవాత, "మే ఐ కమిన్?" అన్న కంఠం విని, "ఎస్!" అంది జ్యోతి టేబిల్ మీది కాగితాలు చూస్తూ.

స్ప్రింగ్ డోర్స్ కిర్రుమన్న శబ్దం! లోన అడుగు పెట్టిన అడుగుల చప్పుడు విని తలెత్తింది జ్యోతి. అంతే! దిగ్భ్రాంతితో ఆమె కళ్ళు విప్పారాయి. "ఆ..కా..శ్! ను....వ్వా!" అంది నోరు తెరుస్తూ.

"జ్యో....తీ!ఇది నీ ఇల్లా"అన్నాడతను అప్రతిభుడై.

"ఔను ఆకాశ్....నువ్వు....ఈ డ్రైవర్ ఉద్యోగం కోసం...."

"ఔను జ్యోతీ!"

"ఫస్టు క్లాసులో యెమ్మెస్సీ పాసైనవాడివి....ఆ ఉన్నత చదువుకు తగ్గ ఉద్యోగమే దొరకలేదా నీకు?"

పేలవంగా నవ్వాడతను. "మన దేశంలో కేవలం

ఉన్నత డిగ్రీలు ఉన్నంతమాత్రాన సరిపోదు జ్యోతీ! వాటితో బాటు మరికొన్ని ప్రత్యేకతలు కూడా వుండాలని స్వానుభవంతో తెలుసుకున్నాను. నావంటి పేదవాడి వద్ద ఆ ప్రత్యేకతలు ఎక్కణ్నించి వస్తాయి?

బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన నన్నూ, చెల్లాయినీ కంటికి రెప్పలా కాపాడుతూ, ఒంట్లోని ప్రతి రక్తపు బొట్టునూ చమట బిందువుగా మార్చి, నన్ను చదివించి, ఇప్పుడు తను పడ్డ ప్రయాసంతా బూడిద పాలైందే అని హతాశురాలైన నా తల్లినీ, చెల్లాయినీ యెలా పోషించను?

ఆమె కన్నీటి ఋణం యెలా తీర్చుకోను? అందుకే... అందుకే ఈ ఉద్యోగంలో చేరడానికి సిద్ధపడ్డాను. యెప్పుడో స్నేహితులవద్ద నేర్చుకున్న డ్రైవింగ్ తీసి పెట్టుకున్న లైసెన్సూ యిప్పుడు ఈ విధంగా పనికి వచ్చాయి."

జ్యోతి హృదయం ఆవేదనాభారంతో ఆర్ద్రమయింది. కాలేజీ రోజుల్లో అతడిని తను యెంతగానో ఆరాధించేది.

ఐతే, సదా తన చదువుసంధ్యల్లో మునిగి తేలే ఆకాశ్ ఆమె అభిమానాన్నీ, ఆపేక్షనూ యెన్నడూ గుర్తించలేదు. రాత్రింబవళ్ళూ తనకోసం శ్రమిస్తున్న తల్లి స్వేద బిందువులకు తగిన మూల్యాన్ని సంపాదించాలనే తపన తప్ప అతనికి మరో ధ్యాస ఉండేదికాదు.

చివరికి ఫైనలియర్ పరీక్షలు రాసి, విద్యార్థులంతా తమ తమ గూళ్ళకు చేరే రోజు కూడా, స్త్రీ సహజమైన సిగ్గూ బిడియాలు జ్యోతి మనసులోని భావాలను అతని ముందు వ్యక్తం కానివ్వకుండా అడ్డుతగిలాయి. మూగ నోములోనే అతనివద్ద వీడ్కోలు తీసుకుని ఇల్లు చేరింది.

7

ఆ తరవాత, అతని ఆచూకీ తెలుసుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమై, నిస్పృహతో నిర్లిప్తంగా వున్న ఈ తరుణంలో హఠాత్తుగా అతని ఆగమనం ఆమెను విచలితం చేసి వేసింది.

"శ్రమకు తగిన ఫలితం ప్రాప్తించకుంటే ప్రతి మనిషీ నిస్పృహతో కృంగిపోవడం సహజం! నువ్వు పడ్డ శ్రమకు ప్రత్యక్ష సాక్షిని నేను. అందుకే, నువ్విలా నిస్పృహ పడటం నేను సహించలేను. నీ చదువుకు తగిన ఉద్యోగం దొరుకుతుంది ఆకాశ్.

నగరంలో మాకు నాలుగు కంపెనీలున్నాయి. వాటిలో ఒకటి వివిధ రసాయనాలూ, మందులూ తయారుచేసే కెమికల్ ఫ్యాక్టరీ. అందులో పోస్టు ఖాళీ వున్నా, లేకున్నా నీకోసం ఓ పోస్టు సృష్టించబడుతుంది. ఈ రోజే మాట్లాడతాను అన్నయ్యతో. నా కోరిక నేదీ ఆయన నిరాకరించరు" అంది జ్యోతి.

"నీ అభిమానానికి కృతజ్ఞుణ్ని. కానీ, స్వయంకృషితోనే మా జీవితాలకు సరైన పునాదులు వేసుకోవాలని నా అభిమతం! ఒకరి సహాయ సహకారాలతో...."

"నీ భావాలూ, ఆదర్శాలూ హర్షించతగ్గవే ఆకాశ్! కానీ, అవి ఇంతవరకూ నీకు ఓ జీవనోపాధి చూపలేక పోయాయని స్వానుభవంతో తెలుసుకున్నావు కదా? బెట్టు చెయ్యక ప్లీజ్, ఈ స్నేహితురాలి సలహా కాదనకు ఆకాశ్!"

ఆలోచించి తలూపాడతను. "సరే, నీ మనసు నొప్పించడం నాకిష్టంలేదు. అలాగే కానివ్వు" అన్నాడు నిట్టూరుస్తూ.

2

"ఏ చెప్పలా? అన్నయ్యా నా అభ్యర్థనేదీ కాదనడని. కెమికల్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ కెమిస్టుగా నీ ఉద్యోగం ఖాయమైంది. అంతేకాదు, మా ఇంటి వెనక తోటలో ఓ ఔట్ హౌస్ ఖాళీగా వుంది. ఈ మహా నగరంలో తగిన సౌకర్యాలు గల ఇల్లు దొరకడం చాలా కష్టం! అందుకే దాన్ని మీకు కేటాయించాము" అంది జ్యోతి మర్నాడు ఆకాశ్‌ని కలిసి.

తల్లీ, చెల్లాయితో వారి ఔట్ హౌస్‌లో మకాం, పెట్టి, ఆ నూతనోద్యోగంలో నిలదొక్కుకునేసరికి నెల రోజులు పట్టింది ఆకాశ్‌కు. వాడిపోయిందనుకున్న ప్రేమ పందిరి, అతని ఆగమనంతో మళ్ళీ నూతన చిగుళ్ళు తొడిగింది జ్యోతి మనసులో.

తన ఉద్యోగం తప్ప మరేమీ పట్టించుకోని తత్వం అతనిది. అహర్నిశలూ అతని ఆలోచన తప్ప మరో ఊసులేని ఆరాటం ఆమెది. సాయంత్రం అతను ఫ్యాక్టరీ నించి ఇంటికి బైలుదేరే సమయాన కార్లో గేటుముందు ప్రత్యక్షమౌతుంది. కంపెనీ నెపంతో అతన్ని కారెక్కించుకుని, బీచికో, సినిమాకో, పార్కుకో తీసికెళ్తుంది. గంటల తరబడి కూర్చుని కబుర్లు చెబుతుంది.

"మనం సహాధ్యాయులం! మంచి మిత్రులం! ఒప్పుకుంటాను. అంతమాత్రాన నా స్థితి మరచి నీతో చనువు పెంచుకుని, విధి గీచిన అగ్నిరేఖలు దాటి, నీ అభిమాన పాత్రుణ్ని కావాలనుకోడం అత్యాశే అవుతుంది.

అలాగే, శ్వేతమనస్కురాలివైన నువ్వు నా వంటి అర్భకుణ్ని ఇలా అందల మెక్కించడం యెన్నడూ సహించదు సమాజం! సంఘంలో యెంతో పరపతీ, ప్రతిష్ట

ఉన్న కుటుంబంమీది. నలుగురూ నాలుగు విధాలా చెవులు కొరుక్కుంటారు. నా కారణంగా మీ కుటుంబం సమాజం దృష్టిలో చులకన కావడం నేను సహించలేను” అన్నాడు ఆకాశ్ ఒకరోజు.

“నువ్వన్న తారతమ్యాలూ, అగ్ని రేఖలూ, విధీ, దైవం గీచినవి కావు ఆకాశ్! సంకుచిత మనసులతో మనం గీసుకున్నవి. సమయం వచ్చింది గనక, ఇన్నాళ్ళూ నాలో అణగారి వున్న భావదీపాలను వెలిగించి, ఆ కాంతిలో నా మనః ఫలకంపై ముద్రవేసుకున్న ఓ సుందరరూపాన్ని చూపుతాను నీకు.

లోకం ఏమన్నా, సంఘం ఈసడించినా, కుటుంబం తృణీకరించినా ఆ రూపాన్ని నేను ఆరాధించడం మానను ఆకాశ్! ఇంకా అర్థం కాలేదా? దాంపత్యమనే పవిత్ర బాంధవ్యంలో మనం ముడిపడటం నీకిష్టంలేదా?”

బ్రతుకు తెరువు చూపిన మనిషి, ఆశ్రయం యిచ్చిన మనిషి, అంత దీనంగా తన సాహచర్యాన్ని అర్థిస్తుంటే, కొవ్వొత్తిలా కరగకపోవడం యెవరి తరం? ప్రేమను ప్రేమించడం, ద్వేషాన్ని ద్వేషించడం మానవ నైజం!

అదే స్పందనకు గురైంది ఆకాశ్ హృదయం! ఉత్తుంగ తరంగంలా పొంగిపొరలింది అతనిలో ప్రేమామృతం! అలా రూపు దిద్దుకుంది వారిమధ్య నూతనాధ్యాయం!!

3

“చెల్లాయ్! నీతో మాట్లాడాలి. ఇలా రా!”

జ్యోతి గదిలోకి రాగానే తలుపు మూసి వెనుదిరిగాడు కిరణ్. “పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ యెవ్వరూ తనని చూడటం లేదనుకుంటుందిట. ఆ పిల్లి సంగతెలా వున్నా, నీ పిల్లి చేష్టలుమాత్రం లోకమంతా

చూసి గుసగుసలాడుకుంటోంది.

లోకం సంగతటుంచి, ఈ రోజు సముద్రం ఒడ్డున మీ ఆటలూ, పాటలూ కళ్ళారా చూసి నిర్ఘాంతపోయాను. యుక్త వయసు వచ్చాక, స్త్రీ పురుషులు పరస్పరం మనసులు ఇచ్చి పుచ్చుకోడం సృష్టి సహజం! ప్రేమించడం తప్పు కాదు. ఒప్పుకుంటాను. ఐతే, అందులోనూ యుక్తా యుక్తాలు యోచించడం వివేక లక్షణం! పొట్ట కూటికోసం మన పంచన చేరి బ్రతికే నౌఖర్నా నువ్వు ప్రేమించింది? ఛ ఛ! వాడికీ, మనకూ ఎందులో సామ్యం?"

"తగిన సమయం చూసి, నేనే ఈ విషయం నీతో ప్రస్తావించాలనుకుంటున్నానన్నయ్యా! ప్రేమించడం తప్పు కానప్పుడు, మనుషులు ఏర్పరుచుకున్న ఈ తారతమ్యాలూ, అగాధాలూ, అడ్డు గోడల గురించి ఆలోచించడం తప్పుకాదా? మంచి మనసుండవలసిన లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్న అతను పేదవాడిగా పుట్టడం నేరమా అన్నయ్యా?"

"కావచ్చు. కానీ, ఈ సమాజంలో బ్రతుకుతున్నప్పుడు అది ఏర్పరచిన కొన్ని కట్టుబాట్లకూ, పరిధులకూ, అవరోధాలకూ, మర్యాదలకూ మనం తలవంచక తప్పదు. నువ్వు చేసిన ఏ తప్పునో కప్పిపుచ్చడానికీ, తప్పించుకోడానికీ అటువంటి అష్టదరిద్రుడికిచ్చి నిన్ను కట్టబెట్టామని రేపు లోకం కోడై కూసే నేను తలెత్తుకు తిరగ్గలనా? పరువుగా బ్రతగ్గలమా?"

"మన మనసులో మాలిన్యం లేనప్పుడు లోకం గురించి యెందుకాలోచించాలన్నయ్యా? అటువంటి సమాజం ఏర్పరిచిన కట్టుబాట్లని నేను తెంచివేస్తాను. తారతమ్యాలని

తారుమారు చేస్తాను. అగాధాలని పూడ్చివేస్తాను. అడ్డుగోడల్ని కూల్చివేస్తాను. నా తుది నిర్ణయం అదే!" అంటూ గబగబ గదిలోంచి బైటికి నడిచింది జ్యోతి.

4

"ఆకాశ్ బాబూ!"

"ఎవరూ?"

"నేనండి. బ్రహ్మయ్యను."

అప్పుడే భోజనాని కుపక్రమిస్తున్న ఆకాశ్ అలాగే లేచి బైటికి వచ్చాడు.

"కిరణ్ బాబుగారు మిమ్మల్ని తొరగా పిల్చుకు రమ్మన్నారండి."

"అలాగా!" అంటూ రిస్టువాచీ చూసుకున్నాడు ఆకాశ్.

రాత్రి ఎనిమిది గంటలు. తల్లితో చెప్పి, నౌఖరు వెంట భవనంవైపు నడిచాడు ఆకాశ్. అతన్ని మేడమీది కిరణ్ గదివద్ద వదిలి వెళ్ళిపోయాడు నౌఖరు.

కాలుగాలిన పిల్లిలా గదిలో పచార్లు చేస్తున్న కిరణ్ అతన్ని చూడగానే సాదరంగా లోనికి ఆహ్వానించి, "నిన్ను డిస్టర్బ్ చేసినందుకు సారీ ఆకాశ్! చాలా ముఖ్యమైన పనుండి పిలిపించవలసి వచ్చింది. విద్యానగర్ వీధిలో నివసించే నా స్నేహితుడికి అత్యవసరంగా యాభై వేలు అవసర మయ్యాయట. నాకు తలపోటుగా వుంది. అందుకే నిన్ను పిలిపించాను."

"దానికేం, ఇచ్చివస్తా నివ్వండి."

"అతని పేరు మోహన్ కుమార్. అదుగో, బల్లమీదుంది డబ్బు బ్యాగ్. అందులోనే అతని విజిటింగ్ కార్డు కూడా ఉంది. దానిపై అతని ఇంటి అడ్రసు ఉంటుంది.

కారు చెల్లాయి తీసుకెళ్ళింది. నువ్వు టాక్సీలో వెళ్ళిరా! అతను యెదురుచూస్తుంటాడు. ఇంద, టాక్సీ ఖర్చు!" అంటూ పర్సుతీసి, వందరూపాయల నోటు అందించాడు కిరణ్.

తలూపి, బల్లమీది నల్లబ్యాగ్ అందుకుని బైటికి నడిచాడు ఆకాశ్.

వీధిలో యెదురైన టాక్సీ యెక్కి, "విద్యానగర్ స్ట్రీట్!" అన్నాడు డ్రైవర్‌తో.

టాక్సీ కదిలాక, బ్యాగ్ జిప్ లాగి, నోట్లకట్టలు తడుముతూ, విజిటింగ్ కార్డు బైటికితీశాడు. దాని ఆధారంతో మోహన్‌కుమార్ ఇల్లు చేరుకుని, టాక్సీ దిగి, "ఇక్కడే వుండు. ఇప్పుడే వస్తాను. మళ్ళీ వెనక్కి వెళ్ళాలి" అన్నాడు డ్రైవర్‌తో.

"సారీ సార్! నాకు వేరే పనుంది. అటు రావడం కుదరదు" అన్నాడు డ్రైవర్.

మీటర్ బిల్ యిచ్చేసి, మోహన్‌కుమార్ యింటి కంపౌండ్ గేటు తెరిచాడు ఆకాశ్. మెయిన్ రోడ్డు పక్కనే ఉంది ఇల్లు. చాలా చిన్న కంపౌండు అది. తలుపు మూసివుంది. కాలింగ్ బెల్ వత్తాడు. లోపల కాలింగ్ బెల్ మోగుతున్న శబ్దం, ఆ నిశ్శబ్ద వీధిలో చాలా స్పష్టంగా వినిపిస్తోంది.

పదినిమిషాలు గడిచినా యెవ్వరూ వస్తున్న అలికిడి లేదు. మరోసారి నొక్కాడు బెల్. తలుపు తెరుచుకోడం అటుంచి, లోపల మనుషులున్న సవ్వడి కూడా లేదు. పడుకున్నారా! గట్టిగా తట్టాడు తలుపుని. అంతే! కిర్రుమంటూ తెరుచుకుంది.

"మోహన్ గారూ!" పిల్చాడు.

13

జవాబు లేదు. మళ్ళీ పిల్చాడు. నిశ్శబ్దం! ఆశ్చర్యంతో లోన అడుగుపెట్టాడు ఆకాశ్. అది చిన్న సైజు హాలు. దాని కిరుపక్కలా రెండు గదులూ. ఓ మూల మేడమీది కెళ్ళడానికి గుండ్రని ఇనప మెట్లు.

"మోహన్ జీ...." పిలవబోతూ చటుక్కున ఆగి పోయాడు.

మేడమీంచి వినిపిస్తోంది సన్నని మూలుగు. గబగబ మెట్లని సమీపించి చెవులు రిక్కించాడు. సందేహం లేదు. యెవ్వరో మూలుగుతున్నారు బాధగా! ఆలస్యం చెయ్యకుండా మెట్లెక్కి పైకి వెళ్ళాడు. రెండే రెండు గదులున్నాయి పైన. మూలుగు వినిపిస్తున్న గది తలుపు తెరిచి వుంది. అందులో అడుగుపెట్టి స్థాణువై పోయాడు ఆకాశ్!

సోఫాలో అడ్డంగా ఒరిగి వున్నాడతను. పాతికేళ్ళ యువకుడు. కడుపులో పిడివరకూ దిగి వుంది కత్తి! ధారగా కారుతోంది రక్తం!! మొహమంతా చెమటలు పట్టి, అతికష్టంమీద కళ్ళు తెరిచి చూస్తున్నాడు. ఆకాశ్‌ని చూడగానే అస్పష్టంగా ఏదో గొణిగాడు.

షాక్‌లోంచి తేరుకుని, గబగబ సోఫాని సమీపించాడు ఆకాశ్. "ఎవరు? యెవరు చేశారీ పని?" అడిగాడు అతన్ని పొదవి పట్టుకుంటూ.

మళ్ళీ ఏదో గొణిగాడతను. అర్థంకాలేదు. అతని కడుపులో మకాం పెట్టిన కత్తి పిడిపై చెయ్యి వేసి, గట్టిగా లాగాడు బైటికి. ఏదో అనాలని నోరు తెరిచాడా యువకుడు. అంతే! పక్కకి వాలిపోయింది అతని తల!! ఆకాశ్ గుండె ఝల్లుమంది!!!

అప్పుడే కిందినించి యెవ్వరో మెట్లెక్కి పైకివస్తున్న

బూట్ల చప్పుడు. చటుక్కున లేచినిల్చున్నాడు ఆకాశ్. ఆలోగా రానేవచ్చారు వాళ్ళు. పోలీసులు!

సోఫాలో పడున్న శవాన్నీ, టీపాయ్‌మీది బ్యాగ్‌నీ, రక్తసిక్త హస్తాలతో కత్తి పట్టుకుని నిల్చున్న ఆకాశ్‌నీ మార్చి మార్చి చూసి, సాలోచనగా తలూపాడు యిన్‌స్పెక్టర్. "ఈ ఇంట్లోంచి పెద్దగా ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని దారినపోయే దానయ్య యెవరో ఫోన్ చేస్తే, క్షణాలమీద వచ్చేశాం! నీ దురదృష్టం మా అదృష్టం కలిసివచ్చి, పారిపోకముందే మా కంటబడ్డావు!"

"నే .... నేను .... నేను చంపలేదతన్ని!" వణికింది ఆకాశ్ కంఠం.

సాలోచనగా తలూపుతూ టీపాయ్‌మీది బ్యాగ్ తాకకుండా జాగ్రత్తగా జిప్ లాగాడు ఇన్‌స్పెక్టర్. అందులో వున్న నోట్లకట్టలూ, విజిటింగ్ కార్డూ చూడగానే తలెత్తి. "హత్యకు కారణం ఇంత స్పష్టంగా కనిపిస్తోంటే నీ మాటలు నమ్మడానికి మేమేం చవటలమనుకున్నావా? సార్జంట్! కఫ్స్ తగిలించు అతని చేతులకి" అన్నాడు కటువుగా.

5

అశనిపాతమైంది ఊహించని ఆ సంఘటన ఆకాశ్ తల్లికీ, చెల్లాయికీ, జ్యోతికీ, బెయిలుపై అతన్ని విడిపించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవడంతో. అతని నిర్దోషిత్వాన్ని నిరూపించడానికి పేరుమోసిన ఓ క్రిమినల్ లాయర్ని నియమించింది జ్యోతి.

కోర్టులో ప్రారంభమైంది విచారణ. ఆకాశ్‌కు తాను డబ్బిచ్చి మోహన్‌కుమార్ ఇంటికి పంపలేదని కిరణ్ ప్లేటు ఫిరాయించేసరికి, నిర్ఘాంతబోయాడు ఆకాశ్!

అప్పుడు తెలిసివచ్చిందతనికి, జ్యోతి జీవితంలోంచి తనను శాశ్వతంగా తుడిచి పెట్టడానికే ఆ పన్నాగమంతా అమలు చెయ్యబడిందని!

బ్యాగుమీదా, కత్తిమీదా ఆకాశ్ వేలిముద్రలు తప్ప మరెవరి వేలిముద్రలూ లేవు. దాంతో మోహన్ కుమార్ని చంపి, ఆ డబ్బు కాజేయడానికి ప్రయత్నించింది అతనేనని నిర్ణయించి, శిక్ష వినిపించింది కోర్టు. యావజ్జీవ శిక్ష!

సంకెళ్ళతో అతన్ని కోర్టు బైటికి తీసికెళ్ళి, వ్యాన్ ఎక్కిస్తుండగా తల్లీ, చెల్లాయీ, జ్యోతీ వెక్కి వెక్కి ఏడ్చారు.

"విధి వక్రించినప్పుడు జీవనగతులు తారుమారవక తప్పవు జ్యోతీ! నాకోసం నువ్వు పడ్డ తాపత్రయం, చేసిన సాయం జీవిత పర్యంతమూ మరవలేనివి. ఇక నా అన్నవారు మిగలని నా తల్లీ, చెల్లెలి గతి ఏమౌతుందో అన్న క్షోభే నన్ను క్రుంగదీస్తోంది.." అన్నాడు ఆకాశ్ డగ్గుత్తికతో.

"నా కంఠంలో ప్రాణం వుండగా వారికే ఆపదా రానివ్వను ఆకాశ్! అలాగే, నీ నిర్దోషిత్వాన్ని నిరూపించేవరకూ నేను నిద్రపోను" అంది జ్యోతి ఉద్వేగంతో.

ఆకాశ్ను మోసుకుంటూ సాగిపోయింది పోలీస్ వ్యాన్.

అతని తల్లినీ, చెల్లెలినీ యథాప్రకారం తమ ఔట్ హౌస్లో ఉండటానికీ, తమ ప్రాపకంలో బ్రతకడానికి యెలాంటి అభ్యంతరం చెప్పలేదు కిరణ్.

చెయ్యని నేరం! యావజ్జీవ కారాగారం! కంటిముందు బ్రతుకంతా అంధకారం! అటు ఆత్మీయుల భయం! ఇటు ప్రతిక్షణం గుండెలో ప్రజ్వరిల్లుతున్న ప్రతీకారం! ఎలా పడుతుంది కునుకు?

అర్ధరాత్రి జైలు గదిలో గోడకానుకుని, శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు ఆకాశ్. సాటి ఖైదీలు చెల్లా చెదురుగా పడుకుని అదమరిచి గురకలు పెడుతున్నారు.

అంతలో, యెవరో తన పక్కన చేరినట్టు తోచి, తృళ్ళిపడి తల తిప్పాడు.

ఖైదీ నెంబర్ 52౭. "వచ్చినప్పట్నించీ చూస్తున్నా! రాత్రిళ్ళు నిద్రపోకుండా యెందుకలా కూర్చుంటావు? ఏమిటి ఆలోచిస్తుంటావు? ఇక్కడ ఉన్న వాళ్ళంతా విధి వంచితులే! నేరమనేది ఎవరూ బుద్ధిపూర్వకంగా చెయ్యరు. పరిస్థితులు! పరిస్థితులే మనిషి చేత చేయిస్తాయి. చివరికి ఇక్కడికి చేరుస్తాయి.

వీళ్ళందరికీ ఐనవాళ్ళూ, ఆత్మీయులూ లేరా? బాధ్యతలూ, భవబంధాలూ లేవా? ఐనా, అన్నీ మరచి, పరిస్థితులతో రాజీపడి, ఎలా నిద్రపోతున్నారో చూడు! రేపు నువ్వూ అలాగే రాజీపడక తప్పదు. అనవసరంగా ఆలోచించి, ఎందుకు మనసు పాడుచేసుకుంటావు? పద. పడుకో!" అన్నాడు సానుభూతితో.

నిట్టూర్చాడు ఆకాశ్. "నేరం చేసి వుంటే, దానికి తగ్గ శిక్ష పడిందికదా అని మనసును జోకొట్టుకోవచ్చు. ఏ నేరమూ చెయ్యని నేను, వయసుమీరిన తల్లికీ, పెళ్ళి కావలసిన చెల్లికీ ఏకైక ఆధారమైన నేను, యావజ్జీవ శిక్షకు గురై, పరిస్థితులతో ఎలా రాజీపడమంటావు."

ఆ ఖైదీ కనుబొమలు ముడివడ్డాయి. "తొలిసారి చూసినప్పుడే నా అంతరాత్మ ఎందుకో నిన్ను నేరస్థుడిగా అంగీకరించలేదు. నిరపరాధివైన నీకు అంత పెద్ద శిక్ష ఎలా పడింది? అభ్యంతరం లేకపోతే చెబుతావా నీ కథ?"

గుదిబండలా గుండెమీద పేరుకున్న ఆవేదన ఒకరి ముందు వెళ్ళబోసుకుంటే, రవంత సాంత్వన చేకూరుతుందంటారు. జరిగిందంతా ఆతనికి వివరించాడు ఆకాశ్.

"నా మీద కుట్రపన్ని ఆ హత్యా నేరంలో ఇరికించిన వ్యక్తి యెవరో తెలిసిపోయింది నాకు. ఒక్క Xంట, కేవలం ఒక్క Xంట, ఈ ఖైదులోంచి బైటపడే అవకాశం లభిస్తే చాలు. వాడి అంతం చూసి, నిజమైన నేరస్థుడిగా తిరిగి వస్తాను."

"ష్..కాస్త మెల్లిగా మాట్లాడు" అంటూ పడుకున్న మిగతా ఖైదీలవైపు చూశాడతను.

"ఇక్కడ కొందరు ఖైదీలు జైలర్ తరఫున గూఢచారులుగా వ్యవహరిస్తుంటారు. పాటి ఖైదీల మాటలు విని జైలర్‌కు చేరవేస్తుంటారు. ఇక్కణ్ణుంచి బైటపడటానికి నువ్వెంతగా ఉబలాటపడుతున్నావో, అంతకు రెట్టింపు నేనూ ఆరాటపడుతున్నాను.

ఈ విషయంలో అన్నిటికీ తెగించగల నీలాంటి సహచరుడికోసం ఎదురు చూస్తున్నాను. నా పేరు తెలుసుగా నీకు? భగీరథ్! నీ పేరు ఆకాశ్ కదూ?"

తలూపాడు ఆకాశ్. ఆ తర్వాత ఇద్దరూ నిద్రకుపక్రమించారు—

మర్నాడు ఖైదీలందరు కొండలమధ్య బండరాళ్ళ

తోలుస్తున్నారు. గునపంతో ఓ రాయిని పక్కకి తొలిగించిన ఆకాశ్ కళ్ళు నేలమీద నిలిచిపోయాయి. రాయి కిందినించి పొడవాటి, లావుపాటి నల్లని తేలు ఇవతలికి వచ్చి అటూ యిటూ పాకుతోంది!

భగీరథ్ వెంటనే దాన్ని చంపడానికి చిన్న రాయందుకున్నాడు.

"ఆగు!" అన్నాడు ఆకాశ్.

"ఏం?"

ఆకాశ్ పలకలేదు. గునపం మొనతో చిక్కుడు గింజని పోలిన తేలుకొండీని తోకనించి వేరుచేసి, చుట్టూ కలయచూశాడు జాగ్రత్తగా. మిగతా ఖైదీలూ, సెంట్రీలూ యెండలో చమట్లు కక్కుతూ తమ తమ గొడవల్లో మునిగి వున్నారు.

తలమీది టోపీతీసి, తేలుమీదవేసి, జాగ్రత్తగా దాన్ని టోపీలోకి చేర్చి, సందులేకుండా టోపీ అంచుల్ని దగ్గరగా మడతబెట్టాడు ఆకాశ్.

"ఏం చేస్తావు దాన్ని?" అడిగాడు భగీరథ్ ఆశ్చర్యంగా.

"చెబుతాను. ఓపికపట్టు" అన్నాడు ఆకాశ్ టోపీని ఓ మట్టిపెళ్ళ మాటున ఉంచి అంచుపై రాయి పెడుతూ.

7

అర్ధరాత్రి జైలు గాఢ నిశ్శబ్దంలో మునిగివున్న వేళ, సెంట్రీలు రైఫిళ్ళతో గస్తీ తిరుగుతున్న వేళ ఆకాశ్, భగీరథ్ జైలుగది తలుపు దగ్గర ఒదిగి ఎదురు చూడసాగారు. లోపల మిగతా ఖైదీలు గురకలు పెడుతూ నిదరబోతున్నారు. గదిముందు వరండాలో లైటు వెలుగుతోంది.

అంతలో ఓ సెంట్రీ ఇటే వస్తున్నట్టు బూట్సుల చప్పుడు విని, సిద్ధంగా వుండమన్నట్టు కన్ను గీటాడు ఆకాశ్. బూట్ల చప్పుడు క్షణక్షణానికీ దగ్గరవుతోంది. టోపీలో సిద్ధంగా వున్న తేలును కటకటాల మధ్య నించి, సరిగ్గా వరండామధ్య పడేశాడు ఆకాశ్.

అదే క్షణంలో సెంట్రీ వచ్చాడక్కడికి. "సార్! తేలు!" అరిచాడు భగీరథ్.

నిదర మబ్బులో వున్న సెంట్రీ అంత చేరువలో అటు వంటి తేలు చూడగానే తృళ్ళిపడి, తలుపు దగ్గరికి జరిగాడు. అంతే! అతని కంఠం చుట్టూ చెయ్యి బిగించి, తలుపుకు వత్తాడు భగీరథ్. రెప్పపాటులో అతని భుజాని కున్న రైఫల్ ఊడలాక్కొని, గొట్టాన్ని తలుపుకవతల తాళానికానించి ట్రిగ్గర్ వత్తాడు ఆకాశ్!

"ధన్!" మన్న శబ్దంతో జైలుగోడలు దద్దరిల్లాయి.

రైఫల్ బోల్టు వెనక్కి లాగుతూ వరసగా రెండు మూడు గుండ్లు పేల్చాడు. తాళం ఊడిపడింది. అప్పటికే ఇటు ఖైదీలూ, అటు సెంట్రీలూ అదిరిపడి హాహాకారాలు ప్రారంభించారు. చెవులు చిల్లులుపడేలా మోగసాగింది ఎమర్జన్సీ సైరన్! జైలు నాలుగు మూలలా కళ్ళు చెదర గొట్టే సెర్చి లైట్లు వెలగసాగాయి. తలుపు తెరిచి బైటి కురికారు, ఆకాశ్, భగీరథ్‌లు.

ఇతర ఖైదీలు కూడా ఎగిరి గంతేసి బైటపడ్డారు. ప్రారంభమయ్యాయి తుపాకీ కాల్పులు. కన్ను మూసి తెరిచేలోగా అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న జైలు వాతా వరణం తుపాకుల మోతతో భీకర రణరంగంగా మారి పోయింది.

ఆకాశ్, భగీరథ్‌లు పరుగెత్తసాగారు. చేతి రివా

ల్వర్ పట్టుకుని పరిగెత్తుకొస్తూ కనిపించాడు జైలర్! తుపాకీ అతనికి గురిపెట్టి, ట్రిగ్గర్ నొక్కాడు ఆకాశ్. రైఫిల్ పేలలేదు. గుళ్ళు ఖాళీ!

అతన్ని దగ్గరికి రానిచ్చి, రైఫిల్ని భగీరథ్ కందించి, చిఱుతలా జైలర్ మీదికి లంఘించాడు ఆకాశ్! ఆ మెరుపు దాడికి జైలర్ పిస్తోలు ఎగిరి క్రిందపడింది!

వెంటనే దాన్ని హస్తగతం చేసుకోగలిగాడు ఆకాశ్. అంతే! పిస్తోలు జైలర్ కు గురిపెట్టి, ట్రిగ్గర్ నొక్కేశాడు. గావుకేకతో గుండె పట్టుకుని నేలకూలాడు జైలర్!

జైలు సిబ్బందిలో కలకలం బైలుదేరింది. ఆ అవకాశాన్ని జారవిడవకుండా, చాటుమాటున నక్కుతూ, సింహద్వారాన్ని సమీపించారిద్దరూ. అక్కడి కాపలా సిబ్బందిపై పిస్తోలు కాల్పులు జరుపుతూ, ఆ గందరగోళంలో గేటు దాటి, చీకట్లోపడి పరుగులంకించారు.

"జైలర్ గారు చనిపోయారు. ఆ పక్కల్ని వదలకండి. కాల్చిపారెయ్యండి" వెనక సెంట్రీల అరుపులు. పరిగెత్తుకొస్తున్న బూట్ల చప్పుళ్ళు. జీపులూ, మోటర్ సైకిళ్ళూ స్టార్టవుతున్న శబ్దాలు!!

రొప్పుతూ, రోజుతూ ఎంతో ప్రయాసమీద వారికి చిక్కా ఇచ్చి, నగరం వెలపల ఓ పాడుపడ్డ ఇంటిని చేరుకోగలిగారిద్దరూ. మొండిగోడలమధ్య కూలబడి, ఎంతోసేపు మౌనంగా ఆయాసం తీర్చుకున్నారు.

తరవాత మెల్లిగా తలెత్తి అన్నాడు ఆకాశ్. "ఈ రాత్రి ఎలాగో వారి బారిన పడకుండా తప్పించుకోగలిగాం! తెల్లారేలోగా పోలీసులు వేటకుక్కల్లా మన కోసం గాలించడం ప్రారంభిస్తారు. పత్రికల్లో మన ఫోటోలు పడితే, ఇటు సామాన్య పౌరులు కూడా మన

పాలిట ప్రమాదకరంగా పరిణమిస్తారు. ఏం చేద్దాం?"

"భయపడకు బ్రదర్! పోలీసుల గాలి అటుంచి, నీపైన ఈగ గాలికూడా సోకకుండా కాపాడే పూచీ నాది. సరేనా?"

"అదే, ఎలా అని?"

"చెప్పక తప్పదన్నమాట! సరే, అలీబాబా నలభై దొంగల గురించి విన్నావా నువ్వు?"

నవ్వాడు ఆకాశ్. "నేనే ఏమిటి? ప్రపంచంలోని ప్రతివాడూ వినివుంటాడా కథ!"

"ఆ కథ గురించి కాదు నేననేది. అలీబాబా నలభై దొంగలనే పేరుతో ఈ మధ్య ఓ ముఠా పెద్ద పెద్ద బ్యాంకుల్ని, రైళ్ళనీ, ఇళ్ళనీ దోచుకుంటూ, పెద్ద ఎత్తున స్మగ్లింగ్ కార్య కలాపాలు చేస్తూ, ఇంతవరకూ పట్టుబడకుండా దేశంలో తీవ్ర సంచలనం రేపుతోందే? దాని గురించి మాట్లాడుతున్నాను."

"అదా! తెలుసు! ఏం? దానికీ, నీకూ యేమిటి సంబంధం?"

"నేను ఆ ముఠాలోని ఒక సభ్యుణ్ని!"

దిగ్భ్రాంతితో ఆకాశ్ కళ్ళు విప్పారాయి. "మరి జైల్లో ఎలా పడ్డావ్?"

"ఖర్మకాలి! ఓ అర్ధరాత్రి సముద్రం ఒడ్డుకు స్మగ్లింగ్ సరుకులతో చేరిన లాంచీలోంచి సరుకుల పెట్టెలు దింపుతుండగా, పెద్ద ఎత్తున పోలీసులు దాడి చేశారు మామీద. ఆ పోరాటంలో ఓ సభ్యుడు మరణించాడు. నేను గాయపడి నేల కొరిగాను. మిగతా సభ్యులు తప్పించుకో గలిగారు.

మా ముఠా రహస్యాలు చెప్పమని పోలీసులు ఎంత

హింసించినా నేను నోరు విప్పలేదు. మా ముఠా నాయకుడి పేరు అలీబాబా! అతని అసలు పేరేమిటో, మనిషి ఎలా వుంటాడో కూడా మేమెరగం!

అంతే కాదు. సాటి సభ్యుల మొహాలుగానీ, పేర్లుగానీ పరస్పరం ఎవరికీ తెలీవు. అందరూ ముసుగుల్లోనే కలిసి పనిచేస్తారు. అందరూ నెంబర్లతోనే పిలవబడతారు. అందులో నెంబర్ వన్ అలీబాబా కుడిభుజం! నెంబర్ టూ ఆయన ప్రియురాలు మర్జీనా!!

సభ్యులందరివద్దా పాకెట్ ట్రాన్స్‌మీటర్లుంటాయి. కావలసిన సభ్యుల్ని ముఠా స్థావరానికి పిలిపించాలనుకున్నప్పుడు అలీబాబా పిలుపు వినిపిస్తుంది వాటిలో. వెంటనే స్థావరానికి వచ్చి, తన ఆదేశాలు అందుకోమని. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప నలభైమంది ఒక్కసారి ఎప్పుడూ స్థావరంలో గుమిగూడరు.

నలభైమందికి మించి ఎట్టి పరిస్థితిలోనూ ముఠాలో ఒక సభ్యుణ్ని కూడా ఎక్కువ చేర్చుకోరు. అందులో సభ్యత్వం అంత సులభంగా దొరికేది కాదు. అసమాన ధైర్యసాహసాలూ, తెలివితేటలూ, తెగింపూ వున్న వారికే అందులో స్థానం లభిస్తుంది. ఎవరైనా శాశ్వతంగా జైలుపాలైతే, లేదా పోలీసు కాల్పుల్లో మరణిస్తే ఆయా ఖాళీల్లో కొత్త సభ్యుల్ని చేర్చుకుంటారు.

అంతకిమించి సభ్యుల సంఖ్య ఎట్టి పరిస్థితిలోనూ నలభైకి దాటదు. మరణించిన, లేదా జైలుపాలైన సభ్యుల కుటుంబాలకు వారి జీవిత పర్యంతమూ పెద్ద సంఖ్యలో పెన్షన్ ముడుతూ వుంటుంది. అందుకే, పట్టుబడ్డ సభ్యులెవ్వరూ ప్రాణం పోయినాసరే ముఠా రహస్యాలు పోలీసులకు చెప్పరు.

చాలా కఠినమైన నియమాలూ, క్రమశిక్షణా వున్నాయి మాకు. ఎవరైనా వాటి నతిక్రమిస్తే ఇక మరణమే శరణ్యం! జైల్లోంచి తప్పించుకోడానికి నువ్వు చూపిన తెలివితేటలూ, ధైర్యసాహసాలు నన్ను ప్రభావితుణ్ని చేశాయి.

అలీబాబా నీలాంటి వ్యక్తిని ముఠాలో చేర్చుకోడానికి ఏమాత్రం వెనుదీయడు. ఎలాగూ మరణించిన సభ్యుడి స్థానం ఒకటి ఖాళీగానే వుండనే వుందిప్పుడు" చెప్పాడు భగీరథ్.

"నన్ను ఆ దొంగల ముఠాలో చేరమంటావా?"

"చేరక ఏం చేస్తావ్? ఎక్కడ, ఎన్నాళ్ళని దాక్కుంటావ్? పట్టుబడ్డావంటే, జైలర్ని చంపిన నేరానికి నీకు మరణశిక్ష తప్పదు. అప్పుడు నీ తల్లీ, చెల్లీ ఏం కాను? ప్రతీకారం సంగతి ఆలోచించావా? నా మాట విను. రూపంలో కొద్దిగా మార్పులు చేసుకుని నిక్షేపంగా మా ముఠాలో చేరిపో!"

ఆలోచనలో పడ్డాడు ఆకాశ్. రెండు నిమిషాల తరవాత తలూపి, "సరే, నన్ను అలీబాబా దగ్గరికి తీసికెళ్ళు. తెల్లవారకముందే మనం అక్కడికి చేరడం మంచిది."

"గుడ్! వెరీగుడ్. పద!" అన్నాడు భగీరథ్ లేస్తూ.

8

ఆ అడవిలో ఎటు చూసినా రాతి కొండలు, చెట్లూ చేమలు.

ఓ కొండ అంచుదద్ద ఆగిపోయాడు భగీరథ్.

ఆశ్చర్యంతో చుట్టూ కలయజూశాడు ఆకాశ్. "ఎక్కడ మీ స్థావరం? కొండరాళ్ళు తప్ప ఇక్కడ

ఏమీ కనిపించడంలేదే!"

భగీరథ్ నవ్వి—"మనం నిల్చున్నది స్థావరం ముఖ ద్వారంముందే! చూడు, ఇప్పుడేం జరుగుతుందో!" అంటూ కొండ అంచును చూస్తూ, "తెరుచుకో..సుమ్..సుమ్..." అన్నాడు మూడుసార్లు.

మరుక్షణం కొండ మధ్య భాగం సరసర చప్పుడుతో షట్టర్ తొలిగినట్టు పక్కకి జరిగి గుహామార్గం ఏర్పడింది. రమ్మన్నట్టు తలూపి గుహలో ప్రవేశించాడు భగీరథ్. లోనికెళ్ళాక వెనుదిరిగి, "మూసుకో...సుమ్...సుమ్..." అన్నాడు.

మరుక్షణం ద్వారం మళ్ళా రాతిపలకతో మూసుకు పోయింది. దాని పక్కనే రిఫ్రిజిరేటర్ని పోలిన ఓ యంత్రం నిలబెట్టి వుంది. భగీరథ్ దానివైపు చూపుతూ, "ఇది కంప్యూటర్! గుహ ద్వారం తెరిచేదీ, మూసేదీ అదే! అలీబాబాతోబాటు, నలభైమంది సభ్యుల కంఠా లన్నీ టేప్ చేసి అందులో పొందుపర్చి వున్నాయి.

ఇతర్లు అరిచి గీపెట్టినా సరే, ద్వారం తెరుచుకోదు! నలభైమంది సభ్యుల్లో ఎవరైనా శాశ్వతంగా జైలుపాల వడంగానీ, చనిపోవడంగానీ జరిగితే, కంప్యూటర్లోంచి వారి కంఠాలు తొలగించి, కొత్త సభ్యుల కంఠాలు పొందుపరుస్తారు. పద!" అంటూ గుహ లోపలికి నడిచాడు.

చాలా విశాలంగా ఉంది లోపల. ముందుకు సాగు తున్నకొద్దీ ఇంకా అనేక గదుల్లాంటి గుహలు ఎదురౌ తున్నాయి. 'నో అడ్మిషన్' అనే ప్లేటు తగిలించి వున్న ద్వారంముందు ఆగిపోయాడు భగీరథ్.

"ఇక్కడే నిల్చో! యిప్పుడే వస్తాను" అంటూ

ఆకాశ్‌ని బైట నిలబెట్టి లోనికి నడిచాడు.

పది నిమిషాల తరవాత తిరిగివచ్చి, "ఊహించని విధంగా నన్ను చూసి నిర్ఘాంతపోయారు అలీబాబా! జైల్లోంచి నేను తప్పించుకోడానికి సహాయపడ్డ నీ గురించి చెప్పాను. వెంటనే పిల్చుకు రమ్మన్నారు. నిన్ను తప్పకుండా ముఠాలో చేర్చుకుంటారనే గట్టి నమ్మకం ఉండబట్టే నీ కళ్ళకు గంతలు కట్టకుండా ఇక్కడికి తీసుకొచ్చాను. పద!" అన్నాడు తిరిగి లోనికి నడుస్తూ.

అతని వెనక అందులో ప్రవేశించి ఆశ్చర్యపోయాడు ఆకాశ్. ఎటు చూసినా గోడల్లో చిత్ర విచిత్రమైన ఎలక్ట్రానిక్ పరికరాలూ, టెలివిజన్ స్క్రీన్‌లూ పొందుపర్చి వున్నాయి. ఎదురుగా స్టేజిలాంటి ఎత్తైన అరుగుపై విశాలమైన బల్ల. దానిపై రకరకాల పరికరాలూ, మైక్‌లూ అమర్చి వున్నాయి. బల్లకవతల ఈజీఛేర్లో కూర్చున్నాడతను.

ఒళ్ళంతా సూపర్ మాన్‌ని పోలిన నల్లని ముసుగు. కదిలే అతని కళ్ళు తప్ప మరేమీ కనిపించడంలేదు. "యూ ఆర్ వెల్‌కమ్ జంటిల్‌మన్!" గుహలో మారుమోగింది అలీబాబా కంఠం.

"జైల్లో మగ్గుతున్న మా సభ్యుణ్ని చాకచక్యంతో విడిపించిన నీ ధైర్యసాహసాలు నన్ను ముగ్ధుణ్ని చేశాయి. నీవంటి పరాక్రమశాలులే మా సంఘానికి కావలసింది. మీరిద్దరూ ఈ దుస్తులు విడిచి, బ్లాక్ డ్రెస్‌లు ధరించండి. భగీరథ్! నువ్వు పాత సంఖ్యతోనే వ్యవహరించబడతావు. ఇతని నెంబర్ ముప్ఫైమూడుగా వ్యవహరించబడతాడు" అన్నాడు.

తర్వాత కంప్యూటర్ కోసం ఆకాశ్ కంఠాన్ని రికార్డు

చేసి, "మీ నూతనాగమనాన్ని ఒక వినూతన పనితో ప్రారంభించాలను కుంటున్నాను. ఈ రోజు రాత్రి రెండు గంటలకు సింగపూర్ నించి ఓ నౌక మన స్మగ్లింగ్ సరుకులతో సముద్రం మధ్యకు రాబోతోంది.

చీకటి పడగానే మీరిద్దరూ సముద్ర తీరంలోని మన ప్రత్యేక ప్రదేశానికి చేరుకోవాలి. అక్కడ మీకోసం ఓ లాంచీ యెదురుచూస్తూ వుంటుంది. అది యెక్కి సముద్రంలో ఈశాన్య దిశగా ప్రయాణం ప్రారంభించాలి. చాలా దూర ప్రయాణం!

సముద్రం మధ్య ఆ నౌక ఎదురుపడగానే అందులోని సరుకులు లాంచీలోకి చేర్చి, తెల్లవారేలోగా మళ్ళీ తీరానికి చేరాలి. అర్థమైందా?"

తలూపాడు భగీరథ్ వినయంగా!

9

"టైమ్ ఎంతవుతోంది?" అడిగాడు ఆకాశ్ చీకట్లో చుట్టూ కలయజూస్తూ.

లాంచీ నడుపుతున్న భగీరథ్ రిస్టువాచీ చూసుకుని, "రెండు గంటలు!" అన్నాడు.

మొత్తం ఎనిమిది గంటల ప్రయాణం! అదీ శర వేగంతో, సముద్రంలో ఎంత దూరం వచ్చారో వారికే తెలీదు.

"అదుగో వెలుగు!" అన్నాడు ఆకాశ్, చిమ్మ చీకట్లో దూరాన మిణుకు మిణుకు మంటున్న వెలుతురు చూపుతూ.

భగీరథ్ అటు పరీక్షగా చూసి, లాంచీ యింజన్ ఆఫ్ చేశాడు. "పద, డెక్ మీదికెళ్ళి చూద్దాం!" అన్నాడు బైనాక్యులర్స్ అందుకుంటూ.

ఇద్దరూ కేబిన్ లోంచి డెక్ మీదికెళ్ళి, లాంచీ అంచు దగ్గర నిల్చున్నారు. భగీరథ్ కాసేపు బైనాక్యులర్లోంచి చూసి, ఆకాశ్ కందించాడు వాటిని. వెలుగు కనిపిస్తున్నవైపు చూడసాగాడు ఆకాశ్. అంతే! వెనకనించి ఒక్క తన్ను తన్నాడు భగీరథ్! జరిగిందేమిటో తెలిసేలోపలే బ్యాలన్స్ తప్పి సముద్రంలో పడిపోయాడు ఆకాశ్.

సముద్రంలో పడ్డ ఆకాశ్ నీటిలో మునుగుతూ, తేలుతూ గట్టిగా అరవసాగాడు. "భ... గీ....ర....థ్! భ....గీ....ర....థ్!!"

లాంచీ ఆగలేదు. వెనుదిరిగి చూడలేదు. నీటిని చీల్చుకుంటూ సాగిపోతోంది శరవేగంతో. కన్ను మూసి తెరిచేలోగా అదృశ్యమైపోయింది దృష్టినించి!

భయభ్రాంతులతో గిరగిర తిరగసాగింది ఆకాశ్ బుర్ర! ప్రాణాలకు తెగించి, జైల్లోంచి తప్పించిన తనని మాయమాటలతో నమ్మించి, నట్టేట్లో ఎందుకుదోశాడో భగీరథ్? తను చేసిన అపరాధం ఏమిటి? ఉపకారానికి ప్రతిఫలం ఇదేనా?

ఎటు చూసినా జలమయం కనిపించని గాఢాంధకారం! ఎంతటి గజ ఈతగాడైనా నడి సముద్రంలో ఎంతసేపని ఊపిరి పీల్చుకోగలడు? తన జీవితం పరిసమాప్తమయ్యే సమయం ఆసన్నమైందా? మనిషి చచ్చినా, మనసులోని ఆశ చస్తుందా?

కాళ్ళూ, చేతులూ ఆడిస్తూ, ఇంకా దూరాన మిణుకు మిణుకు మంటున్న వెలుగువైపు ఆశగా చూడసాగాడు ఆకాశ్. ఏమిటది? నావేనా? మరి చలనం లేదేం? శబ్దం రాదేం? ఏదైనా సరే, ఊపిరున్నంతలో అక్కడికి

చేరడం ఉత్తమం!

ఈదడం ప్రారంభించాడు ఆకాశ్. కాసేపు బోర్లా, కాసేపు వెల్లకిలా ఈదుతూ అతి కష్టంమీద అక్కడికి చేరి, నిర్ఘాంతపోయాడు. అది నౌక కాదు. ద్వీపం! చెట్లూ చేమలతో నిండి వున్న ద్వీపం! చెవులు చిల్లులుపడే కీచు రాళ్ళ రొద!

చెట్ల ఆకుల మధ్యనించి ఓ ఎత్తయిన ప్రదేశంలో కనిపిస్తోంది ఆ వెలుగు. ఏమిటది? మానవ నివాసమా? అదే నిజమైతే తను బ్రతికి బట్టకట్టినట్టే. అనుకుంటూ చెట్లూ చేమల్ని చీల్చుకుంటూ ముందుకు సాగాడు.

అరగంట తరవాత ఆ వెలుగును చేరి నివ్వెరపోయాడు. రాతితో కట్టిన, అతి పురాతనమైన భవనం అది! భవనం నాలుగు వైపులా ఎత్తయిన బురుజులు నిర్మించి వున్నాయి. పై అంతస్తులోని కిటికీగుండా కనిపిస్తోంది ఆ వెలుగు!

భవనం ముఖద్వారం మూసి వుంది. నేలమీంచి రాయందుకుని, గట్టిగా తట్టాడు. లోపల ఎవ్వరో నడిచి వస్తున్న అడుగుల సవ్వడి. తలుపువద్ద ఆగిపోయింది శబ్దం! గడియతీస్తున్న చప్పుడు, పెద్ద చప్పుడుతో తెరుచుకుంది తలుపు.

వేరొకరైతే ఆ వ్యక్తిని చూసి, గుండెలవిసి గావు కేకపెట్టేవారే! భయంతో నాలుగడుగులు వెనక్కి వేశాడు ఆకాశ్! ఆరున్నర అడుగులకన్నా పొడవే వుంటాడతను. ఒళ్ళంతా దట్టమైన రోమాలు. విశాలమైన ఛాతీ, భుజాలవరకూ వేలాడే చింపిరి జుత్తు. చింపాంజీని పోలిన మొహం!

వానరాకృతిలో వున్న ఆ నరుడి చేతిలో తనవైపు గురిపెట్టి వున్న పిస్తోలు చూడకుంటే ఆ కాల్తీని నిజంగా

ఓ విచిత్ర వ్యాగమే అనుకు నేవాడు. "నేను మీ శత్రువును కాను. సముద్ర దుర్ఘటనకు లోనై మీ సహాయంకోసం ఇక్కడకు వచ్చాను" అన్నాడు గుండె చిక్కబట్టుకుని.

ఆ భీకరాకారుడు పలకలేదు. సరికదా, కన్నార్పకుండా చూస్తూ రాతిబొమ్మలా నిల్చున్నాడు.

అంతలో—"స్లాబో! ఎవరొచ్చారు?" అన్న కంఠం వినిపించింది వాడి వెనకనించి.

వెంటనే వాడు గుమ్మాని కడ్డం తొలిగాడు. లోన కనిపించిన వ్యక్తిని చూశాక ఆకాశ్ ప్రాణం లేచి వచ్చింది. సుమారు అరవై ఏళ్ళ వృద్ధుడతను. వెండిలా పండిన తల. కనుబొమలూ, మీసాలూ కూడా అలాగే తెల్లబడ్డాయి. పాదాలవరకూ శేలాడే ఖరీదైన స్లీపింగ్ గౌన్. నోట్లో పొగలు చిమ్ముతున్న పైపు.

ఆకాశ్‌ని చూసి అతని కనుబొమలు ముడిపడ్డాయి. "ఎవరు బాబూ నువ్వు? ఎలా వచ్చావిక్కడికి?" అడిగాడు ఆప్యాయంగా.

చెప్పాడు ఆకాశ్ తన దీన గాథ. వృద్ధుడు సాలోచనగా తలూపి, "భయపడకు! రా లోపలికి. వీడి పేరు స్లాబో! మూగవాడు. నా సేవకుడు. నా పేరు తేజ—ధర్మతేజ! వాడి విచిత్రాకారం చూసి భయపడ్డావు కదూ?

చాలా ఏళ్ళ క్రితం ఓ ప్రయాణీకుల ఓడ తుఫానులో చిక్కుకుని, ఈ వైపు కొట్టుకువచ్చి తునాతునకలైంది. అందులోని ఒక స్త్రీ స్పృహలేని స్థితిలో వుంటే, కొన్ని మగ చింపాజీలు ఆమెను రక్షించి, జతకట్టాయి. దాంతో వారికి ఈ వానరాకారుడు జన్మించాడు.

నేనిక్కడికి వచ్చినప్పుడు వీడు చాలా చిన్నవాడు.

నా ప్రాపకంలోనే ఇంతటి వాడయ్యాడు. రా లోపలికి” అన్నాడు.

లోన అడుగుపెట్టాడు ఆకాశ్. అక్కడక్కడా లావుపాటి కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. సాధారణంగా అటువంటి భవనాల్లో గోడలకు అందమైన పెయింటింగ్ లూ, చిత్రపటాలూ వేళాడుతూ కనిపిస్తాయి. కానీ, ఎటు చూసినా, రకరకాల జంతువుల తలలూ, చర్మాలే వేళాడదీసి ఉన్నాయక్కడ.

వృద్ధుణ్ని అనుసరిస్తూ మేడ మెట్లెక్కి పైకి చేరుకున్నాడు.

“సిటీలో బాగా తడిసి పోయావు. జలుబు చేస్తుంది. ముందు పొడి బట్టలు మార్చుకో నాయనా! తరవాత తీరిగ్గా కూర్చుని మాట్లాడుకుందాం!” అంటూ స్లాబో వైపు తిరిగి, సైగలతో ఆదేశాలిచ్చాడు తేజ.

తన వెంట రమ్మన్నట్టు తలూపి, ఓ గదిలోకి నడిచాడు స్లాబో. ఆధునిక జీవనానికవసరమయ్యే అన్ని హంగులూ అమర్చి వున్నాయక్కడ. బీరువా తెరిచి, ఓ చారల పైజామా, చొక్కా, స్లీపింగ్ గౌన్, టవల్ తీసి అందించాడు స్లాబో.

10

తల తుడుచుకుని, బట్టలు మార్చుకుని, తిరిగి వాడి వెంట పక్క గదిలోకి నడిచాడు ఆకాశ్. ఖరీదైన డైనింగ్ టేబిల్, దానిపై రకరకాల తినుబండారాలూ అమర్చి వున్నాయక్కడ. ఓ కుర్చీలో యెదురుచూస్తున్నాడు తేజ.

‘రా నాయనా! కూర్చో! సాటి మనుషులతో సంపర్కం లేక, ఏకాంత వాసంతో నేను చాలా విసుగెత్తి

పోయాను. దారి తప్పి యెవరైనా ఇక్కడికి వస్తే ఆ రోజు నాకు పండుగే. ముందు రెండు పెగ్గులు విస్కీ పుచ్చుకుని, తనివిదీరా మాట్లాడుకుందాం!" అంటూ రెండు గ్లాసుల్లో విస్కీ పోశాడు ధర్మతేజ.

కాదనడం మర్యాదగా వుండదని, గ్లాసందుకున్నాడు ఆకాశ్. "నడి సముద్రంలో ఉన్న ఈ ద్వీపంలో ఇంత పెద్ద భవనం వుందంటే, ఇంకా పెద్ద సంఖ్యలో జన వాసం ఉండివుండా లిక్కడ!"

వృద్ధుడు నవ్వి—"నో, నో! ఇక్కడ నేనూ, స్లాబో తప్ప మరో మానవుడు నివసించడు. ఈ భవనం కూడా నేను కట్టించింది కాదు. యెప్పుడో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జర్మన్లు తమ యుద్ధ నౌకల కమాండ్ హెడ్ క్వార్టర్ కోసం కట్టుకున్నారు దీన్ని!" అన్నాడు విస్కీ సేవిస్తూ.

"ఆకారాన్ని బట్టీ, భాషను బట్టీ మీరు భారతీయులేనని తెలుస్తోంది. ఐతే, మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా, యేకాంతంగా ఈ నిర్మానుష్య దీవిలో యెందుకుంటున్నారు?" అడిగాడు ఆకాశ్.

నిట్టూర్చాడు తేజ. "అదో పెద్ద కథ నాయనా! అడిగావు గనక చెబుతా విను. ఈ ఇంటి గోడలకు వేళాడుతున్న అసంఖ్యాకమైన జంతు చర్మాలూ, తలలూ చూశావుగా? దీన్నిబట్టి వేటంటే నాకెంత ప్రాణమో, అందులో ఎంత అనుభవం గడించానో అర్థం అయివుంటుంది నీకు?

బాల్యంనించే నాకా పిచ్చి వుంది. రచయితలకు ఏదో ఒకటి రాయందే ఎలా తోచదో, చిత్రకారులకు ఏదో ఒకటి గీయందే ఎలా ఊబుసుపోదో, అలాగే నాకూ ఏదో

ఒక పక్షినీ, జంతువునీ వేటాడందే నిదరపట్టేది కాదు. ఆ వ్యాపకంలో నేను తిరగని అడవిలేదు. గాలించని ప్రదేశంలేదు.

అలా నలభై ఏళ్ళు వచ్చేసరికి ఆ వేటపట్ల నాకు మొహం మొత్తింది. విసుగు పుట్టింది! రచయితలూ, కవులూ, చిత్రకారులూ సంగీత ప్రియులూ తమ తమ కళల్లో వినూతన ప్రయోగాలు చేస్తూ, కొంగ్రొత్త పుంతలు తొక్కుతూ ఎలా సంతృప్తి పడతారో, అలాగే నా వేటలోనూ నేనొక వినూతన పద్ధతి ప్రారంభించి ఆనందాన్ని పొందసాగాను."

"ఏమిటా పద్ధతి?" అడిగాడు ఆకాశ్!

"నేను వేటాడదలచుకున్న ప్రాణిలో అత్యంత తెలివి తేటలూ, అపార ఆలోచనా శక్తీ, తననితాను కాపాడు కోగల జిత్తులూ ఉండితీరాలి. ఈ లోకంలో అటువంటి శక్తియుక్తులుగల ప్రాణి మనిషే కదా?"అన్నాడు తేజ నవ్వుతూ.

షాక్ తగిలినట్లు బ్రాన్పడిపోయాడు ఆకాశ్!

"ఎప్పుడైతే నాకా నూతనాలోచన వచ్చిందో ఒంటరిగా కనిపించే ప్రతి మనిషినీ వేటాడి నరకయాతన పెట్టి చంపసాగాను. అందులో లభించే ఆనందమే వేరు."

అదేదో అతి సామాన్య విషయమైనట్లు మాట్లాడు తున్న అతని మాటలు విని, ఝల్లుమంది ఆకాశ్ ఒళ్ళు.

"నాగరిక లోకంలో యెంతకాలం సాగుతుంది ఆ వేట? దేశ పోలీసులంతా ఏకమై నిద్రాహారాలు మాని నాకోసం గాలించసాగారు. దాంతో అక్కడుండటం క్షేమదాయకంకాదని, నడి సముద్రంలో నిర్మానుష్యంగా వున్న ఈ ద్వీపానికి చేరి తలదాచుకుంటున్నాను.

అడుగడుగునా అనేక ఊబులతో, ప్రమాదకర విష సర్పాలతో, జంతువులతో నిండిన ద్వీపం ఇది. అందుకే ఈ వైపు యెవ్వరూ రారు. కొత్తలో నేనూ అనేక ఇబ్బందులు పడ్డాను. తరవాత అన్నీ అలవాటయ్యాయి. ఐతే, నా రక్త పిపాసను చంపుకోలేక, కనిపించిన ప్రతి విష సర్పాన్నీ, క్రూరమృగాన్నీ చంపుతూ కాలక్షేపం చెయ్యసాగాను.

అప్పుడప్పుడూ సముద్ర తుఫానుల్లో చిక్కుకున్న ఓడల సిబ్బందీ, ప్రయాణీకులూ, చేపలు పట్టే జాలరులూ ఈ వైపుకు వస్తుంటారు. వారిని వేటాడి చంపడంలో నాకు లభించే ఆనందం అంతా ఇంతా కాదు.

ఈ ఏకాంతంలో నా తిండి తిప్పలూ, అవసరాలూ చూడడానికి ఓ మనిషి కావాలి గనక స్లాబోను చంపే ఉద్దేశమే నాకు లేదు. నెలకోసారి మా క్కావలసిన సరుకులూ, బట్టలూ, ఇతర వస్తువులూ హెలికాప్టర్లో పంపిస్తారు మా వాళ్ళు. అది పైనించే సరుకులు జారవిడిచి వెళ్ళిపోతుంది!"

"ఐతే, అందరిలాగే నన్ను కూడా...." వణికింది ఆకాశ్ కంఠం.

ధర్మతేజ నవ్వి—"తప్పుతుందా నాయనా! నీలాంటి ఆరోగ్యవంతుణ్ణీ, యువకుణ్ణీ వేటాడటంలో లభించే ఆనందాన్ని ఎలా వదులుకోమంటావు చెప్పు?" అన్నాడు.

"కిరాతకుడా! నువ్వు మనిషివి కావు. ఏ అపకారమూ చెయ్యని సాటిమనుషుల్ని చిత్రవధ చేసే నువ్వు రాక్షసుడి కన్నా అధముడివి" అన్నాడు ఆకాశ్ ఆవేశం ఆపుకోలేక.

వేరొకరైతే ఆ మాటలకు ఆగ్రహించేవారే. కానీ, తేజ చాలా నింపాదిగా నవ్వుతూ, తల అడ్డం తిప్పి, “పొరబడుతున్నావు నాయనా! ఏ మనిషినీ నేను వున్న ఫళాన చంపను. నా బారినించి కాపాడుకోడానికీ, ఈ ద్వీపంనించి తప్పించుకోడానికీ మూడు రోజులు వ్యవధి ఇస్తాను.

ఉదయం నువ్వు నిద్రలేవగానే మూడు రోజులకు సరిపడే డ్రైఫుడ్ బ్యాగులో నింపి, పెద్ద సైజు వాటర్ కేరియర్లో మంచినీళ్ళు నింపి, యివ్వబడతాయి నీకు. అలాగే, విష సర్పాలనించీ, క్రూరమృగాలనించీ నిన్ను నువ్వు కాపాడుకోడానికి పెద్దసైజు కత్తికూడా యివ్వబడుతుంది.

నాకు చెందిన వేట వాటి పాలబడి మరణించడం నాకిష్టం వుండదు. పగటిపూట నానుండి నీకే ఆపదా రాదు. చీకటిపడ్డ తరవాతే రైఫిల్ తో నిన్ను వేటాడడానికి బైలుదేరతాను. పగలంతా నువ్వు చాలా స్వేచ్ఛగా ద్వీపంలో తిరుగుతూ నిన్ను రక్షించుకునే మార్గాలు అన్వేషించవచ్చు. రాత్రిపూట నా కంట పడ్డావా, నీ మరణాన్ని యేశక్తీ ఇక ఆపజాలదు!” అన్నాడు.

“మూడు రోజుల వరకూ నీ కంట బడకపోతే?”

“విజయం నీదే! ఐతే, అలా జరగడం సాధారణంగా అసంభవం! ఇది చాలా చిన్న ద్వీపం! కాస్త తెలివిగల వారైతే మొదటి రాత్రి నానించి తప్పించుకోవచ్చు. ఇంకాస్త బుద్ధిగలవారైతే రెండో రోజుకూడా తప్పించుకోగలరు. మూడో రోజు కూడా తప్పించుకున్నవాళ్ళు బహు అరుదు.

ఆదేజరిగితే, బేషరతుగా నా ఓటమి ఒప్పుకుని, నాలుగో

రోజు సూర్యోదయంతో నిన్ను సగౌరవంగా విడిచి పెడ్తూ, నీకు సహాయంగా లైఫ్ బోట్ ఇస్తాను. సామాన్యంగా మొదటి రాత్రే నా వేట కుక్కలు వాసనచూస్తూ నువ్వెక్కడ దాక్కున్నావో ఇట్టే పసిగట్టేస్తాయి."

"వేటకుక్కలా?" భయంతో పెద్దవయ్యాయి ఆకాశ్ కళ్ళు.

"ఔను. నా వద్ద అత్యంత ప్రమాదకరమైన ఆరు మేలుజాతి వేటకుక్కలున్నాయి. నా తుపాకీ గుళ్ళు మనిషిని వేటాడిన మరుక్షణం అవి ఆ శవాన్ని చీల్చి చెండాడి ఆవురావురుమంటూ ఆకలి తీర్చుకుంటాయి. అబ్బ! ఆ దృశ్యం చూసితీరాల్సిందే! మాటలతో చెప్పడం నా తరంకాదు."

ఆకాశ్ యువక రక్తం ఒక్కసారి యెగజిమ్మింది గుండెలోకి. ఆ నరరూప రాక్షసుణ్ని పచ్చడి చేయాలన్న ఆవేశంతో మెరుపులా లేవబోయాడు.

"ఆగు నాయనా! తొందరపడక! ఆవేశం నీకే అనర్థం! అదుగో, తలుపు దగ్గర సిద్ధంగా నిల్చున్న స్లాబోను చూడలేదా? వాడి సంగతి నీకు తెలీదు. నాకైనా కొంత జాలీ, దయా, నియమం వున్నాయి. వాడిలో అవి వీసమెత్తు కూడా లేవు. మృగంకన్నా క్రూరుడు. జాగ్రత్త! మళ్ళీ అటువంటి పిచ్చివేషాలేం వెయ్యక! ఇప్పటికే బాగా పొద్దుపోయింది. వెళ్ళి పడుకో.

ఇంత రాత్రి వరకూ మేము ఎందుకు మేల్కొనున్నా మనుకున్నావు? నిన్న ఓ జాలరి ఈదురుగాలికి దారితప్పి, పడవ బోల్తాపడి, ఈ వైపు కొట్టుకు వచ్చాడు. ఈ రోజు వాణ్ని వేటాడే తొలి రాత్రి! వేటకు బయలుదేరబోతుంగా నువ్వు వచ్చావు" అంటూ స్లాబో వైపు తిరిగి సౌజ్ఞలతో

ఆదేశా లిచ్చాడు తేజ.

వాడు ఆకాశ్ వైపు చూస్తూ తనవెంట రమ్మనట్టు సైగచేశాడు. నిర్జీవ ప్రతిమలా లేచి, వాణ్ని అనుసరించాడు ఆకాశ్. గెస్టు రూంలో అడుగుపెట్టిన మరుక్షణం దభాలున తలుపు మూసి బైట గడియపెట్టాడు ప్లాబో. ఆకాశ్ గుండె గుభిల్లుమంది!

పక్కమీద వాలాడేగాని, ఓ పట్టాన నిదరపట్టడం లేదు. రాబోయే విపత్తును ఎలా ఎదుర్కోవాలి? ఎలా? ఎలా? ఎడతెగని ఆలోచనలతో వేడెక్కుతోంది బుర్ర. బైట కుక్కలు మొరగడం వినిపించింది. అంటే, ఆ కిరాతకుడు మానవవేటకు బైలుదేరతున్నాడన్నమాట!

క్రమక్రమంగా కుక్కల అరుపులు దూరం కాసాగాయి. అలసటవల్ల కొద్దిగా కునుకుపట్టింది ఆకాశ్ కు. ఎక్కడో "ఢాం!" మనే శబ్దంతో తృళ్ళిపడి కళ్ళు తెరిచాడు. కిటికీగుండా తూరుపు దిక్కున తెలతెలవారుతోంది. అంటే, ఆ అమాయక జాలరివాడు తుపాకీ గుండుకు బలైపోయాడన్నమాట! వేటకుక్కలు విందు చేసుకుంటున్నాయన్నమాట. ఆకాశ్ ఒళ్ళు జలదరించింది.

11

గదిలో కాలకృత్యాలు తీర్చుకున్నాక, తలుపు తెరిచి, అతన్ని డైనింగ్ రూంలోకి తీసికెళ్ళాడు ప్లాబో!

"రా నాయనా, రా! అదేమిటి? రాత్రి నిద్రపోలేదా? మొహమంతా పీక్కుపోయిందే? ఆ జాలరి వెధవను వేటాడ్డం దండగే అయింది. ఏ మాత్రం మజా రాలేదు. చాలా సులభంగా దొరికిపోయాడు. ఎటువంటి ప్రతిఘటనా లేకుండా చచ్చి వూరుకున్నాడు.

సరే, కూర్చో! ఈ పూట నాతో విందారగించి, నీ దారి చూసుకో. చీకటిపడ్డాక ప్రారంభమౌతుంది నీ పరీక్ష! నీ అదృష్టం, నా అదృష్టం ఎలా వుందో అప్పుడే తేలుతుంది" అన్నాడు ధర్మతేజ నవ్వుతూ.

గుండె కృంగిపోతోంటే ఏం తినగలడు? ఇంత ఎంగిలి పడి, చేతులు కడుక్కున్నాడు ఆకాశ్. అన్నట్టే తిను బండారాలు నింపిన ఓ సంచీ, వెడల్పాటి, పొడవాటి ఓ కత్తీ అతని కందించి, "ఊఁ!" అన్నాడు స్లాబో! తలుపులు వైపు చూపుతూ.

అంతే! మెరుపులా ఒరలోంచి కత్తిలాగి, వాడిమీద లంఘించాడు ఆకాశ్! అతను వేసే ప్రతి వేటునూ లాఘవంగా తప్పించుకుంటూ, పంజా దెబ్బలుతింటూ ఎట్టకేలకు ఆకాశ్ చేతిని మెలివేసి, లొంగదీశాడు స్లాబో! ఆయాసంతో వాడి శ్వాస ఎగిసి పడుతోంది. చింపాంజీలా ఘీంకారిస్తున్నాడు.

పైపు తాగుతూ నింపాదిగా ఆ దృశ్యం తిలకిస్తున్న ధర్మతేజ నవ్వి — "ముందే చెప్పానుకదా నాయనా! వాడిముందు నీ శక్తియుక్తులేవీ పనికిరావని. తలచుకుంటే అరక్షణంలో వాడు నీ శరీరాన్ని నజ్జుచెయ్యగలడు. ఆ విధంగా నా రక్తపిపాస నజ్జుకావడం నాకిష్టంలేదు. పిచ్చివేషాలు వెయ్యకుండా బుద్ధిగా వెళ్ళిరా!" అన్నాడు.

స్లాబో అతన్ని అలాగే తోసుకుంటూ, ఘీంకరిస్తూ ఇంట్లోంచి బైటికి తీసికెళ్ళి, అవతలికి నెట్టి, తలుపు మూసేశాడు.

ఊబులు చూసుకుంటూ జాగ్రత్తగా నడుస్తూ మధ్యాహ్నానికల్లా ద్వీపమంతా చుట్టేశాడు ఆకాశ్.

చీకటి పడకముందే తనని రక్షించుకునే ఏర్పాటు చేసుకోవాలి. ఒకచోట మొదలంటా విరిగి, మరో చెట్టు కొమ్మమీద వాలి, యెండిపోయిన లావుపాటి వృక్ష కాండం ఆకర్షించిందతన్ని. ఏ కాస్త తోసినా, అది ఆ కొమ్మ అంచుమీంచి జారి నేలకూలేలా వుంది.

ఆ రెండు చెట్ల నడుమ దట్టమైన పొదల గుబురు, ఓ మర్రిచెట్టునుండి పొడవాటి నాలుగైదు ఊడలు సేకరించి, తిరిగి ఆ చెట్టును చేరుకున్నాడు. కాండం వాలి వున్న చెట్టు ఎక్కి, జాగ్రత్తగా ఎండిపోయిన కాండం అంచుకు మర్రి ఊడలు బిగించి, కిందికి వేలాడదీసి దిగాడు.

కత్తి సాయంతో ఆ చెట్ల నడుమ పొదలముందు పొడవుగా, వెడల్పుగా గొయ్యి తవ్వడం ప్రారంభించాడు. సూర్యాస్తమయం వేళకు నాలుగడుగుల లోతు గొయ్యి తయారైంది. దానిమీద సన్నని ఎండు పుల్లలు పేర్చి, వాటిపై పచ్చని ఆకుకప్పి, గొయ్యి నానుకున్న పొదల్లో దూరి, వేళాడుతున్న మర్రి ఊడల్ని అందుబాటులో వుంచుకున్నాడు.

చీకటి పడుతున్నకొద్దీ చిత్ర విచిత్ర అరుపులతో, కుతూహాలతో మారుమోగసాగింది ద్వీపం! రాత్రి నడిజాము వేళ, దూరాన కుక్కలు మొరుగుతూ వస్తున్న శబ్దం విని, కొట్టుకోనారంభించింది ఆకాశ్ గుండె. క్షణాలుగడుస్తున్నకొద్దీ కుక్కల అరుపులు దగ్గరవుతున్నాయి. చీకట్లో ఆగి ఆగి టార్చి వెలుగు కూడా కనిపిస్తోంది.

రెండు కుక్కలు నేలను వాసన చూస్తూ రానే వచ్చాయక్కడికి. వాటి వెనక తుపాకీ పట్టుకున్న

ధర్మతేజ! ఊపిరి బిగబట్టి పొదలో ఒదిగి కూర్చున్నాడు ఆకాశ్. కుక్కలు పొదను చూస్తూ గొంతెత్తి మొరుగుతున్నాయి. పొదను సమీపించిన మరుక్షణం హాఠాత్తుగా, రెండూ గోతిలో పల్టీకొట్టి కూనిరాగాలు తియ్యసాగాయి.

లి ప్రపాటు కుక్కలేమయ్యాయో అర్థంకాలేదు ధర్మతేజకు. అర్థమవగానే సాలోచనగా తలూపాడు. "నీ అతితెలివిని మెచ్చుకుంటున్నాను నాయనా! కుక్కల బారినించి తప్పించుకున్నావుగానీ, నా తుపాకీ గురినించి యెలా తప్పించుకోగలవు?" అంటూ టార్చి వెలుగులో జాగ్రత్తగా చూస్తూ పొదను సమీపించాడు.

అంతే! ఊడలుపట్టి గట్టిగా లాగాడు ఆకాశ్! ఎండిపోయిన చెట్టుకాండం ఫెళఫెళమంటూ కిందపడింది. తేజ మెరుపులా అవతలికి జరక్కుంటే అతని తల పచ్చడయ్యేదే! ఐనా, కుడి భుజం బాగా ఒరుసుకుపోయి రక్తం కారసాగింది.

భయంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి. ఆ చెట్టు కాండం కింద కూలగానే దొర్లి ఆకాశ్ తవ్విన గోతిలో పడింది. అంతకుముందే అందులో కూరుకుపోయిన కుక్కల కూనిరాగాలు ఇప్పుడు ఆగిపోయాయి శాశ్వతంగా!

"ఆకాశ్! నీలాంటి తెలివిగల వేట నా జీవితంలో చూసి యెరగను. నా రెండు కుక్కలు కోల్పోయిన దుఃఖంకన్నా ఈనాటి వేటలో లభించిన ఆనందం సదా జ్ఞాపకం వుంటుంది నాకు. నా భుజం గాయపడకుంటే, ఈ రాత్రి నీ మరణం తప్పేదికాదు. రేపు వస్తాను మళ్ళీ. గుడ్ నైట్!" అంటూ వెనుదిరిగి వెళ్ళిపోయాడు తేజ.

12

మర్నాడు మధ్యాహ్నానికల్లా! సముద్ర తీరంనించి, బరువుగా, సన్నగా వున్న పలకల్లాంటి రెండు రాళ్ళూ, మర్రి ఊడలూ సేకరించి, ఓ చెట్టుకింద కూర్చున్నాడు ఆకాశ్. ఆ రాళ్ళతో కత్తిమొనను బాగా సానబట్టి, కత్తిపిడి కిరుపక్కలా, ఊడలతో ఆ రాతి పలకలు కట్టాడు బిగదీసి.

బ్యాగులోని తినుబండారాలు సుష్టుగా తిని, కడుపు నిండా నీళ్ళు తాగి, పొదలో దూరి పడుకున్నాడు. నిద్ర మేల్కొని చూస్తే చీకటి పడుతోంది. కత్తీ, బ్యాగూ అందుకుని, ముందే ఎన్నుకున్న ఓ వేపచెట్టు కిందికి చేరాడు. బ్యాగులోని తినుబండారాలుతీసి, అక్కడక్కడా చెట్టు కింద వెదజల్లాడు. ఆ కిరాతకుడివద్ద ఇంకా నాలుగు కుక్కలు మిగిలాయి. ఆ తినుబండారాల వాసనకు అవి తప్పకుండా ఇటే వస్తాయి!

ధర్మతేజా! ఈ రోజు నీ అంతో, నా అంతో తేలి పోతుంది. అనుకుంటూ, కత్తితో చెట్టు ఎక్కి అనుకూల మైన ఓ కొమ్మమీద కూర్చున్నాడు. నడిజాము వేళ దూరాన కుక్కల అరుపులు వినిపించసాగాయి. టార్చి వెలుగు అటూ, ఇటూ పడుతోంది.

అరుపులు దగ్గరవుతున్నకొద్దీ ఆకాశ్ గుండె దడ తీవ్రం కాసాగింది. కొమ్మ కిరుపక్కలా కాళ్ళువేసి కూర్చుని, కత్తి మొన కిందికి పెట్టి, రెండు చేతులతో పిడిని అదిమి పట్టుకున్నాడు.

కుక్కలు దగ్గరికి రాగానే ఆశ్చర్యపోయాడు ఆకాశ్. ఒకటి కాదు, రెండు కాదు. నాలుగు కుక్కలు! అన్నిటికీ పొడవాటి గొలుసులు పట్టుకుని ప్లాబో వస్తున్నాడు

ముందు. అతని వెనక ధర్మతేజ!

బహుశా, నిన్న గాయంపడ్డందుకు ఈరోజు సహాయం కోసం స్లాబోని తోడు తీసుకొచ్చాడన్నమాట! ఈరోజు కూడా తాను గొయ్యి తవ్వి వుంటే, ఆ గోతిలో కుక్కలు పడిపోకుండా వాటికి గొలుసులు కట్టి, గోతిలో పడబోతే వెంటనే వెనక్కి లాగడానికి ఏర్పాటు చేసుకున్నారు.

ఇప్పుడేం చెయ్యాలి? పైనించి అతని తలమీద కత్తి దింపి చంపాలన్న తన పథకం తారుమారయిందే! ముందు స్లాబో పనిపట్టి, తరవాత వాడి సంగతి చూస్తే? ఆకాశ్ ఇంకా ఆలోచిస్తుండగానే స్లాబో వచ్చేశాడు చెట్టు కిందికి.

సరిగ్గా వాడి తలకు గురి చూసి, కత్తి విడిచాడు ఆకాశ్. రాళ్ళ బరువుకు సూటిగా వెళ్ళి, వాడి తలలో దిగబడింది కత్తి! గావుకేకతో దద్దరిల్లింది ద్వీపం! మొదలు నరికిన చెట్టులా నేలకూలాడు స్లాబో!

ఆ షాక్ నించే తేజ తేరుకోకముందే గబగబ చెట్టు దిగి, చీకట్లో పరుగుతీశాడు ఆకాశ్. గట్టిగా మొరుగుతూ అతని వెంటపడ్డాయి కుక్కలు. వాటి వెనక తేజ!

ముందూ వెనకా చూడకుండా చెట్లనీ, పుట్టల్నీ చీల్చుకుంటూ, పడుతూ లేస్తూ శక్తికొద్దీ పరుగుతీస్తున్నాడు ఆకాశ్.

క్షణాలు గడుస్తున్నకొద్దీ, కుక్కలకూ, అతనికీ మధ్య దూరం తరిగిపోసాగింది. కొద్దిసేపట్లో అవి అతనిమీద పడతాయనగా సముద్రతీరాన్ని చేరుకున్నాడు ఆకాశ్. ఎత్తయిన బండరాళ్ళు నిండి వున్నాయక్కడ. ఓ రాతి మీద యెక్కి సముద్రంలో దూకేశాడు ఆకాశ్.

రొప్పుతూ, రోజుతూ పక్కలలో అక్కడికి చేరిన తేజ పళ్ళు పటపట కొరికాడు కోపంతో. చాలా సేపు సముద్రంలో టార్చి వేస్తూ అక్కడే నిల్చున్నాడు. నీటిపై ఆకాశ్ ఐపులేదు! ఎంతదూరమని ఈదుకు పోగలడు? ఊపిరాడక మునిగి చస్తాడు.

అనుకుంటూ నిరాశతో వెనుదిరిగి, భవనం వైపు నడిచాడు. పక్కల్ని భవనం బైట వదిలేసి, లోనికెళ్ళి తలుపు మూసుకున్నాడు. స్లాబో హాతాన్మరణం అతన్ని బాగా కృంగదీసింది. తుపాకీని హాలు గోడకు వేళాడదీసి మెట్లగుండా మేడమీద తన గదిలోకెళ్ళి, తలుపు మూసి వెనుదిరిగాడు.

అంతే! తేజ కళ్ళు దిగ్భ్రాంతితో విప్పారాయి.

"ఆకాశ్! నువ్వా! ఎలా వచ్చావిక్కడికి?"

"ఈదుకుంటూ!" అన్నాడు ఆకాశ్ కుర్చీలోంచి లేస్తూ.

"నీ ధైర్యాన్ని అభినందించి తీరాలి. ఇంతకుముందు కొందరు ఈ ద్వీపంనించి తప్పించుకుపోయినా, స్లాబోను చంపే సాహసం చెయ్యలేదు...."

"స్లాబోనే కాదు, ఇప్పుడు నిన్ను చంపే సాహసం కూడా నేను చెయ్యబోతున్నాను" అన్నాడు ఆకాశ్ నవ్వుతూ.

"ఆ సాహసానికి తగ్గ శిక్ష యెంత భయంకరంగా ఉంటుందో నువ్వు కలలోకూడా ఊహించి వుండవు" అన్నాడు తేజ పిడికిళ్ళు బిగిస్తూ.

"ఎందరో అమాయకుల్ని క్రూరంగా చంపిన నీకు ఆ భగవంతుడు యే శిక్ష విధించాడో యిప్పుడు కళ్ళారా చూడు" అంటూ అతనిమీదికి లంఘించాడు ఆకాశ్.

ముసలాడు కదా, చాలా సులభంగా చితగ్గొట్టవచ్చను కున్న ఆకాశ్ అంచనా తారుమారయింది. అంత వయసు లోనూ తేజ అతిలాఘవంగా అతన్ని ప్రతిఘటించ సాగాడు. ఇద్దరిమధ్యా ముష్టి యుద్ధం కొనసాగింది.

ఎంతైనా యువరక్తం! అటు శక్తి ఉడిగిన శరీరం! రాను రాను తేజ ఆకాశ్ దెబ్బల ధాటికి తట్టుకోలేక పోతున్నాడు. శక్తినంతా కూడగట్టుకుని, అతని దవడకింద పిడిదెబ్బ తీశాడు ఆకాశ్. అంతే!

ధర్మతేజ మొహంమీది ప్లాస్టిక్ సర్జరీ తొలగిపోయి మరో కొత్త రూపం ప్రత్యక్షమైంది! ఆ కొత్త రూపాన్ని చూడగానే ఆకాశ్ చేష్టలుడిగి కొయ్యబారి పోయాడు!!

పదహారేళ్ళ క్రితం జరిగిన ఓ ఘటన హఠాత్తుగా అతని మనో ఫలకంపై ప్రత్యక్షమైంది! అప్పుడు తొమ్మిదేళ్ళ కుర్రాడు తను. సోదరి సరోజ ఐదేళ్ళ పసిపాప. తండ్రి ఫారెస్టు ఆఫీసర్! చల్లని దరహాసం తప్ప విషాద గీతంలేని నిండు కుటుంబం తమది.

ఒక రోజు ఆహ్లాదంగా గడిపి వద్దామని తండ్రి తమను ఫారెస్టుకు తీసికెళ్ళాడు జీపులో. ఓ చెట్టుకింద హాయిగా పిక్నిక్ చేసుకుంటున్నారు. తను చెల్లాయిని అల్లరిపెడుతూ ఆడుకుంటున్నాడు.

అంతలో అడవి మధ్య హఠాత్తుగా తుపాకీ పేలిన శబ్దం వినిపించి అందరూ ఉలిక్కిపడ్డారు. 'నా అనుమతి లేకుండా నా ఫారెస్టు రేంజిలో యెవరు వేటాడుతున్నారు? వెళ్ళి చూస్తానుండండి' అంటూ లేచి, ఆ శబ్దం వినిపించిన వైపు నడిచాడు నాన్న.

తల్లి తననూ, చెల్లాయినీ పొదివి పట్టుకుని అక్కడే కూర్చుంది. నాన్న వెంట వెళతానని మారాం చేస్తూ తల్లి

యెంత వారిస్తున్నా వినకుండా తండ్రి వెళ్ళినవైపు పరుగుతీశాడు తను. అలా చాలా దూరం వెళ్ళాక, ఓ చోట పొదలకవతల మాటలు వినిపించాయి.

ఆకులు చీల్చి అటు చూశాడు. చేతిలో తుపాకీ పట్టుకుని, తండ్రితో ఘర్షణ పడుతున్నాడో వ్యక్తి. అతను యెవ్వరో కాదు. ఇప్పుడు తనముందు సహజ రూపంలో నిల్చున్న ధర్మతేజే!

'నీ అనుమతి లేకుండా నీ ఫారెస్టులో జంతువుల్ని వేటాడకూడదా ఆఫీసర్? ఐతే, వాటికి బదులు నిన్నే వేటాడితే ఎలా వుంటుంది?' అంటున్నాడు విషపు నవ్వు నవ్వుతూ.

'యూ స్కౌండ్రల్!' అంటూ యెగిరి అతని డొక్కలో తన్నాడు తండ్రి.

ఆ దెబ్బకు తూలి, ధర్మతేజ తుపాకీ కిందపడింది. అతను దాన్ని అందుకోకుండా ముష్టి ఘాతాలు కురిపించసాగాడు తండ్రి. ఇద్దరి మధ్యా కాసేపు భీకర సమరం కొనసాగింది. తను భయంతో మాటరాక గుడ్లప్పగించి చూడసాగాడు.

అంతలో ధర్మతేజ కిందపడ్డ తుపాకీని అందుకోగలిగాడు. మరుక్షణం తుపాకీ పేలిన శబ్దం మారుమోగింది అడవిలో! రక్తసిక్తమైన కడుపు పట్టుకుని నేలకొరిగాడు తండ్రి!! తుపాకీ శబ్దంవిని, దూరాన ఫారెస్టు గార్డు పరిగెత్తుకొస్తున్న చప్పుడుతో పొదల్లోపడి పారిపోయాడు వీడు.

మస్తిష్కంమీద చెరగని ముద్రవేసిన ఆ దృశ్యం అడపాదడపా కలలో కనిపించినప్పుడల్లా తృళ్ళిపడి

తేసుంటాడు తను. ఆ నాడు ఆ చిన్నారి మనసులో అంటుకున్న నిప్పురవ్వ ఈనాడు ప్రచండ అగ్నిజ్వాలగా మారి భగ్గుమంది ఆకాశ్ గుండెలో!

దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ యెగిరి ఆ కిరాతకుడి ఛాతీమీద తన్నాడు రెండు కాళ్ళతో. ఆ దెబ్బకు తట్టుకోలేక విరుచుకుపడ్డాడు ధర్మతేజ. అతని రొమ్ముమీద కూర్చుని ఆరచేతుల్లో గొంతు పుచ్చుకుని, గట్టిగా నులమడం ప్రారంభించాడు ఆకాశ్.

కొద్ది క్షణాలకే గుడ్లు తేలవేసి అంతిమ శ్వాస విడిచాడు ధర్మతేజ. చల్లబడుతున్న గుండెతో లేచి నిల్చున్నాడు ఆకాశ్. కింద భవనం చుట్టూ తిరుగుతూ మొరుగుతున్నాయి కుక్కలు. గబగబ తను తొడుక్కున్న బట్టలు విడిచాడు. ఆ బట్టల్ని ధర్మతేజ శవానికి తొడిగి, అతని బట్టలుతీసి తను తొడుక్కున్నాడు.

రక్తసిక్తమైన శవాన్ని రెండు చేతుల్లో ఎత్తి కిటికీని సమీపించాడు. కుక్కలు వినేలా గట్టిగా ఈలవేశాడు. తోకలూపుకుంటూ కిటికీ కిందికి చేరి గొంతెత్తి మొరగసాగాయి. వెంటనే శవాన్ని కిటికీలోంచి బైటికి విసిరాడు. అంతే! ఆకాశ్ దుస్తుల వాసనతగిలి, అది శత్రువు శవమే అనుకుని, యజమాని శవంమీద విరుచుకుపడ్డాయి కుక్కలు!

ఆలస్యం చెయ్యకుండా ఇల్లంతా గాలించాడు. స్టోరు గదిలో లైఫ్ బోటూ, రెండు తెడ్లూ, బల్ల సొరుగులో ఓ పిస్తోలూ దొరికాయి. లైఫ్ బోట్ భుజాన ఎత్తి భవనంలోంచి బైటపడి గబగబ తీరాన్ని చేరి, సముద్రంమీద బోట్ యెక్కి, తెడ్లువేస్తూ ముందుకు సాగాడు.

13

మూసివున్న గుహముందు ఆగి, "తెరుచుకో.... సుమ్... సుమ్....." అన్నాడు ఆకాశ్ మూడుసార్లు.

సరసర చప్పుడుతో బండమధ్య, రాతిపలక తొలిగి పోయింది. చేతిలో పిస్తోలు సిద్ధంగా పెట్టుకుని, లోన అడుగు పెట్టాడు ఆకాశ్. గుహలో సూదిపడితే వినిపించే నిశ్శబ్దం!

"మూసుకో ....సుమ్....సుమ్...." అన్నాడు. గుహ ద్వారం మూసుకున్నాక, అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగాడు ఆకాశ్. లోపల అలీబాబా వుండే ప్రత్యేక గుహముందు ఆగి, చెవులు రిక్కించాడు. యెటు వంటి అలికిడీలేదు. నెమ్మదిగా లోన అడుగు పెట్టాడు.

"స్వాగతం! సుస్వాగతం మైడియర్ ఆకాశ్!" అన్న కంచు కంఠం విని ఉలిక్కిపడ్డాడు.

అలీబాబా! మసక వెలుగులో, విశాలమైన బల్ల వెనక ఈజీఛైర్లో జారగిలబడి విలాసంగా ఊగుతున్నాడు. కోపంతో ఎరుపెక్కింది ఆకాశ్ మొహం!

"నేను మీకేం అపకారం చేశాను? యెందుకు నన్ను నడి సముద్రంలో తోసి చంపాలనుకున్నావు? నా చావు సంగతెలా వున్నా, నీ అంతుమాత్రం ఇప్పుడు నా చేతిలోనే రాసిపెట్టి వుంది" అంటూ పిస్తోలు అతనివైపు గురిపెట్టాడు.

అంతే! అమాంతం ఎగిరి గుహ కప్పుకంటుకుపోయింది పిస్తోలు!

పకపక నవ్వాడు అలీబాబా. "పైన కప్పంతా ఎలక్ట్రానిక్ మాగ్నటిక్ సిస్టంతో నిండివుంది. నామీద పిస్తోలు ఎక్కుపెట్టడం అంత సులభంకాదు. నీ ఆవేశాన్ని

అర్ధం చేసుకున్నాను. ముఠా నియమాన్ననుసరించే నిన్ను మృత్యు ద్వీపం సమీపంలో సముద్రంలో తోయించడం జరిగింది! అక్కణ్నించి ఈదుకుంటూ నువ్వు మృత్యు ద్వీపానికి చేరుకుంటావని మాకు తెలుసు.

ఎవరైతే ఆ ద్వీపంలో నివసించే ధర్మతేజ చేతిలో చావకుండా తప్పించుకుని క్షేమంగా ఇక్కడికి చేరుకుంటారో ఆ పరాక్రమవంతుడికే మా ముఠాలో స్థానం ఇవ్వబడుతుంది. అది పరీక్ష! ఆ పరీక్షలో నువ్వు నెగ్గావు.

ఈ రోజుతో నువ్వు మా ముఠాలో సంపూర్ణ సభ్యుడివి! ఈ శుభ సమయంలో సీనియర్ సభ్యులందర్నీ ఆహ్వానించి, విందూ, వినోదం ఏర్పాటు చెయ్యదలచాను. రేపటినించీ వారితో కలిసి నీ కార్య కలాపాలు ప్రారంభమౌతాయి. అర్థమైందా?"

ఆకాశ్ నోటమాట పెగల్లేదు చాలా సేపు. దిగ్భ్రమ నించి తేరుకుని, అతికష్టంమీద అడిగాడు.

"ఒక విషయం ఇంకా అర్థం కాలేదు నాకు. ఆ ధర్మతేజాకూ, మీకూ ఏమిటి సంబంధం?"

"తండ్రీ కొడుకుల సంబంధం!" అన్నాడు అలీబాబా నవ్వుతూ.

14

విశాలమైన గుహలో నలభైమంది ముఠా సభ్యులూ, నల్లని ముసుగుల్లో వరసగా నిల్చున్నారు. కాలుగాలిన పిల్లిగా వారిముందు పచార్లు చేస్తున్నాడు అలీబాబా. కాస్త యెడంగా అతని పక్కన మర్జీనా నిల్చునుంది.

"నాలుగేళ్ళనించీ నిరాటంకంగా సాగిపోతున్న మన కార్యకలాపాలు గత కొద్ది రోజులుగా దెబ్బతింటు న్నాయి? మన ముఠాకు గ్రహణం పట్టిందా? ఒకటి

కాదు, రెండు కాదు, మొత్తం నాలుగుసార్లు! పటిష్టమైన పథకం వేసి, అమలు జరుపుతున్న తుదిక్షణంలో హఠాత్తుగా ఊడిపడుతున్నారు పోలీసులు!

ఎలా? ప్రతిసారీ ప్రాణాలకు తెగించి, వారితో పోరాడుతూ, పట్టుబడకుండా తప్పించుకోగలిగినా, మన సభ్యుల్లో చాలామంది తీవ్ర గాయాలతో మృత్యు ముఖం నించి బైటపడ్డారు. పోలీసులకు అంత స్పష్టంగా మన పథకాలు తెలిసిపోతున్నాయంటే, మనలోనే ఎవ్వరో వారితో చేతులు కలిపి, రహస్యాలు చేరవేస్తున్నారన్న మాట! ఎవరా ద్రోహి?" అంటూ ఒక్కొక్క సభ్యుడి ముందు ఆగి ప్రశ్నించసాగాడు అలీబాబా.

ఎవరిలోనూ చలనం లేదు. శిలా ప్రతిమల్లా నిల్చున్నారు.

"సరే, ఆ నమ్మకద్రోహి ఎవరో నేను నిరూపిస్తాను" అంటూ చప్పట్లు చరిచాడు అలీబాబా.

మరుక్షణం నెంబర్ వన్ లోపలికెళ్ళి, గొలుసుతో బంధించి వున్న ఓ అల్సేషియన్ కుక్కను తీసుకొచ్చాడక్కడికి. కుక్క మెడలో అందమైన తోలు బెల్టు మెరుస్తోంది.

దాన్ని సభ్యులకు చూపుతూ, "కుక్కకన్నా హీనుడైన ఆ విశ్వాసఘాతకుడు దీని మెడలోని ఆ తోలు బెల్టులో మన రహస్యాలు రాసిపెట్టి, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు పంపేవాడు. అనుమానంతో ప్రతి సభ్యుడి నివాసంమీదా నిఘా ఏర్పాటు చేశాను.

అప్పుడు తెలిసింది ఈ కుక్క రహస్యం! ఆ ద్రోహి ఇంటినించి తరుచూ ఇది పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్ళిరావటంతో మన వివరాలు వారికెవరు చేరవేస్తు

న్నారో తేటతెల్లమైంది. ఆ నమ్మకద్రోహి యెవరో మీరు స్వయంగా చూడండి. ఎంత ముసుగులో వున్నా, యెంతమందిలో వున్నా కుక్కలు ఇట్టే పసిగడతాయి తమ యజమానిని" అంటూ దాని మెడలోని గొలుసు ఊడదీశాడు అలీబాబా.

కుక్క తోకూపుతుంటూ వరసగా నిల్చున్న ఒక్కొక్కరినీ వాసన చూస్తూ, ఓ సభ్యుడి ముందాగి, కాళ్ళపై నిల్చుంటూ ఎగిరెగిరి పడసాగింది అతనిమీద!

"చూశారా ఆ కుక్క విశ్వాసం! మన ఉప్పుతింటూ మనకే ఎసరు పెడుతున్న ఆ ఊర కుక్కను ఇప్పుడు ప్రత్యక్షంగా చూడండి" అంటూ గబగబ అతన్ని సమీపించి, విసురుగా మొహంమీది ముసుగు లాగాడు అలీబాబా.

"ఆకాశ్! నువ్వా!!" అంది వర్జీనా దిగ్భ్రాంతితో.

ఆకాశ్ పలకలేదు. మొహంలో యెటువంటి భయభ్రాంతులూ కనిపించకుండా తలూపాడు.

"ఎందుకు? ఎందుకు చేశావీపని? ఆశ్రయమిచ్చి, ఆదుకున్న మమ్మల్నే నట్టేట్లో ముంచాలనుకుంటున్నావా?" పళ్ళు పటపట కొరికాడు అలీబాబా.

"నేనెవరికీ ద్రోహం చెయ్యలేదు. నా కర్తవ్యాన్ని పొల్లుపోకుండా పాటించాను. అంతే!"

"కర్తవ్యమా!?"

తలూపాడు ఆకాశ్. "నేను సి.బి.ఐ. ఆఫీసర్ని! మీ అంతం చూడటానికి వచ్చిన కాలయముణ్ని."

విరగబడి నవ్వాడు అలీబాబా. "జైల్లోంచి పారిపోతూ జైలర్ని, సెంట్రీలనీ కాల్చి చంపిన నువ్వు సి.బి.ఐ.

ఆఫీసరవా?"

"అది నాటకం! మిమ్మల్ని బుట్టలో వెయ్యడానికి అల్లిన బూటకం! ఎప్పుడైతే నామీద హత్యాభియోగం మోపబడి, కేసు కోర్టుకెక్కిందో, అప్పుడే ప్రభుత్వాని కాపథకం స్ఫురించింది. ఆదివరకే యావజ్జీవ శిక్షపడి, భగీరథ్ ఎంత హింసించినా మీ గురించి చెప్పలేదు.

దాంతో నన్నూ యావజ్జీవ ఖైదీగా ఆ జైల్లో ప్రవేశ పెట్టి, భగీరథ్ వుండే సెల్లోనే వేశారు. ఆ విధంగా అతనితో పరిచయం పెంచుకుని, సానుభూతి సంపాదించు కున్నాను. ముందు వేసుకున్న పథకం ప్రకారం తేలు సంపాదించడం, సెంట్రీముందు వెయ్యడం. అతను కావాలని మా కందుబాటులోకి రావడం, నే నతని తుపాకీ లాక్కుని, తాళం తెరవడం.

తరవాత జైలర్‌తో తలపడటం, అతని చేతిలోని నకిలీ పిస్తోలందుకుని, అతన్ని కాల్చడం అంతా ఓ పథకం ప్రకారం జరిగిపోయింది. దాంతో భగీరథ్‌కు నామీద మంచి గురి ఏర్పడింది. ఆ విధంగా నేను నీవరకూ చేర డంలో సఫలీకృతుణ్నయ్యాను" అన్నాడు ఆకాశ్ నవ్వుతూ.

"నెంబర్ వన్! వెంటనే వీడి ఒళ్ళంతా గుళ్ళతో జల్లెడ చెయ్యి!"

నెంబర్ వన్ చేతిలోని మెషిన్ గన్ ఎత్తి, ఆకాశ్ వైపు గురిపెట్టాడు.

"కొన్ని విషయాల్లో ఆవేశం పనికిరాదు అలీబాబా! నిదానం ప్రధానం! నేను చచ్చినంతమాత్రాన నీతోబాటు ఈ ముఫ్ఫైతొమ్మిదిమంది ప్రాణాలూ పోలీసుల పిడి కిళ్ళలో పడకుండా తప్పించుకోలేవు.

ఈ ముప్పైతొమ్మిదిమంది అసలు పేర్లూ, పుట్టు పూర్వోత్తరాలూ, వేలిముద్రల ప్రింట్లు కూడా సేకరించి పదిలపర్చాను. నేను మరణించిన మరుక్షణం అవి పోలీసుల చేతిలో పడతాయి. నువ్వు తప్పించుకోవచ్చు. నీతోపాటు మర్జీనా తప్పించుకోవచ్చు. మిగతావారి గతేమౌతుందో ఆలోచించావా?" అన్నాడు ఆకాశ్ శాంతంగా.

ముసుగులో వున్న ముప్పైతొమ్మిదిమంది సభ్యుల్లో కలవరం బైలుదేరింది.

"నీవు చెప్పేదంతా నిజమేనని ఏమిటి ఋజువు?" అడిగాడు అలీబాబా.

"వీరిలో కొందరి అసలు పేర్లూ వ్యక్తిగత వివరాలూ చెప్పమంటావా? ఐతే విను...."

"ఆగు! నెంబర్లు తప్ప ఒకరికొకరు పరిచయం లేని ఇంతమంది ముందు పేర్లూ, వివరాలూ తెల్పడం మంచిది కాదు. ఇలా రా!" అంటూ ఓ గదిలోకి దారితీశాడు అలీబాబా.

నెంబర్ వన్ స్టెన్ గన్‌తో ఆకాశ్‌ని కవర్ చేస్తూ ఆ గుహలోకి తీసికెళ్ళాడు. మర్జీనా కూడా అనుసరించింది వారిని. పదినిమిషాల తరవాత ముగ్గురూ మళ్ళీ ఇవతలికి వచ్చారు.

"ఫ్రెండ్స్! వీడు చెప్పింది అక్షరాల నిజం! అదృష్టవశాత్తూ నా గురించి తెలుసుకోకముందే వీడి అసలు స్వరూపం బైటపడింది. మీ వివరాలు బహిర్గతమైనందుకు మీ రేం కంగారు పడకండి.

"వీడి దగ్గరున్న ఆ ఫైళ్ళు పోలీసుల చేతిలో పడకముందే చిటికెలో ఇక్కడికి తెప్పిస్తాను చూడండి!"

అంటూ ఆకాశ్ వైపు తిరిగాడు అలీబాబా. "చెప్పు! ఆ వివరాల ఫైళ్ళు ఎక్కడ దాచావు? చిత్రహింసల పాలు కాకముందే బుద్ధిగా చెప్పేయ్!"

"ప్రభుత్వం ఏ ఉద్దేశంతో నా కీపని అప్పగించిందో ఆ ఉద్దేశం పూర్తయ్యేవరకూ నా కంఠంలో ప్రాణం వుండగా మీకు లొంగేది లేదు" అన్నాడు ఆకాశ్ నిర్భయంగా.

"సంకెళ్ళతో కట్టేయండి వీణ్ని!"

నలుగురు కలిసి, ఆకాశ్‌ను లాక్కెళ్ళి, గుహగోడలో అమర్చివున్న సంకెళ్ళు బిగించారు చేతులకు. "ఫార్ములా నెంబర్ ఫోర్ ప్రయోగించి, వాడి నోరు విప్పండి" ఆదేశించాడు అలీబాబా.

ఆకాశ్ ఒంటిమీద హంటర్‌తో ప్రారంభమైంది దెబ్బల వర్షం! దెబ్బలకు బట్టలు చిరుగుతున్నాయి. చర్మం చిట్లి రక్తం చిమ్ముతోంది. చమటతో నిలువునా తడిసి పోతున్నాడు. ఐనా, ఫలితం లేకపోవడంతో నెంబర్ వన్ అలీబాబాను సమీపించి,

"చిత్రహింసలకు వాడు చచ్చి ఊరుకుంటే, మన కొంపలు మునుగుతాయి" అంటూ చెవిదగ్గర చెయ్యిపెట్టి, రహస్యంగా ఏదో అన్నాడు.

మరుక్షణం అలీబాబా కళ్ళు మెరిశాయి. "వెరీగుడ్! అదే మంచి ఐడియా! వెంటనే అమలు జరపండి" దెబ్బలు ఆపమన్నట్టు సైగ చేస్తూ.

ఆకాశ్ సొమ్మసిల్లి తల వాల్చేశాడు నిల్చున్నచోటే!

15

"అన్నయ్యా!" అన్న కేకతో తృళ్ళిపడి కళ్ళు తెరిచాడు ఆకాశ్.

గుహలోకి తల్లినీ, చెల్లినీ ఈడ్చుకొస్తున్నారు నెంబర్ థన్, అతని అనుచరులు.

"బంధించండి వాళ్ళను" ఆజ్ఞాపించాడు అలీబాబా.

ఇద్దరూ గుహగోడకు బంధించబడ్డారు అతని కెదురుగా.

"ఆకాశ్! ఇది ఆఖరి అవకాశం! కని పెంచిన తల్లీ, గారాల చెల్లీ చిత్రవధ కాకముందే చెప్పెయ్! ముఠా సభ్యుల వివరాలు యెక్కడ దాచావో?"

"నా స్వార్థంకోసం కర్తవ్యానికి ద్రోహం చెయ్య లేను."

"చూస్తారేం? ప్రారంభించండి ఫార్ములా నెంబర్ ఫోర్!" అరచాడు అలీబాబా.

తల్లీ, చెల్లెలిమీద కొరడా దెబ్బలు పడుతున్నకొద్దీ ఆకాశ్ ఒంట్లోని అఖండ శక్తి పాదరసంలా చేతుల్లోకి పాకసాగింది. బలమంతా చేతుల్లో కూడగట్టుకుని, ఒక్క పెట్టున లాగాడు. గోడలోని కొక్కాలతోసహా ఊడి వచ్చాయి గొలుసులు.

విరుచుకుపడ్డాడు వారిమీద. అతన్ని కాల్చి చంపా లంటే, అరక్షణం పట్టదు. కానీ, ఆ విధంగా తమ రహ స్యాలు యెక్కడ దాచబడ్డాయో ఆమాకీ తెలియదు. అందుకే, అతను వేసే దెబ్బలకు ప్రతి దెబ్బలుతీస్తూ పోరాడసాగా రందరూ.

ఒక్కడూ అంతమందితో నెగ్గడం సాధ్యమా? స్వల్ప వ్యవధిలోనే అందరూ అతిన్ని అదుపులోకి తేగలిగారు.

"నీ నోటి తాళం విప్పే అసలు ప్రయోగం ఇప్పుడు ప్రారంభమౌతుంది చూడు. నెంబర్ ఫోర్! ప్రారం భించు ఫార్ములా నెంబర్ సెవన్!" అరిచాడు అలీబాబా.

నెంబర్ నాలుగు సరోజని సమీపించి, ఆమె కొంగు

పుచ్చుకున్నాడు. జరగబోయేదేమిటో అర్థమైంది ఆకాశ్ కు. "అబలపై అత్యాచారం జరిపే అప్రాచ్యులారా! ఆగండి! నా ఇంట్లోని ఉక్కు బీరువాలో దాచి వున్నాయి మీ రహస్యాలు.

ఆ బీరువా తెరిచి చూస్తే హేంగర్లకు వేళాడే బట్టలు తప్ప మరేమీ కనిపించవు. ఆ బీరువా లోపల అటుకంటిదే మరో రహస్య బీరువా వుంటుంది. దాని తలుపు తాళం నెంబర్లు కలిపితే తప్ప తెరుచుకోదు.

మొదటి బీరువాలో నిల్చుని, తాళం నెంబర్లు కలిపి తలుపు తెరిస్తే, లోపల పేర్చి వుంటాయి మీకు చెందిన నలభై ఫైళ్ళు!"

అలీబాబా వెంటనే కాగితం, కలం తెప్పించి, "ఆ తాళం తెరిచే నెంబర్లు రాసివ్వు దానిమీద" అన్నాడు.

గత్యంతరంలేని పరిస్థితి. రాయక తప్పలేదు ఆకాశ్ కు.

"మీరిద్దరూ వెళ్ళి, వీడి ఇంటినించి ఆ ఫైళ్ళు తీసుకు రండి" అన్నాడు అలీబాబా నెంబర్ వన్, మర్జీనాల వైపు చూస్తూ.

"ఆగండి!" అన్నాడు నెంబర్ మూడు మధ్యలో.

ప్రశ్నార్థకంగా చూశాడు అతన్ని అలీబాబా!

"మా జాతకాలతోసహా సేకరించి వున్న అత్యంత కీలకమైన ఫైళ్ళవి. ఎవరుపడితే వారు వాటిని తాకడానికి వీల్లేదు. నెంబర్ వన్, మర్జీనాలు రేపు వాటిద్వారా మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయరని ఏమిటి గ్యారంటీ?"

"నీకు మతిగాని పోయిందా? వాళ్ళిద్దరూ నా కుడి, ఎడమభుజాలని తెలీదా మీకు?"

"కావచ్చు. అలాగే, భవిష్యత్తులో మా అనుమానమూ నిజం కావచ్చు. ముందు జాగ్రత్తకోసం మే మిలా అలో

చించడం తప్పు కాదు కదా?" అన్నాడు నెంబర్ ఇరవై నాలుగు.

"ఐతే, ఏం చెయ్యమంటారు?"

"మాకంటే అన్నీ తెలిసిన వ్యక్తి బాధ్యతగల వ్యక్తే వాటిని తీసుకురావడానికెళ్ళాలి" అన్నాడు నెంబర్ ముప్పైఆరు.

"ఆ బాధ్యతగల వ్యక్తి యెవ్వరో కాదు. మీరే! మీమీదే మాకు పూర్తి విశ్వాసం వుంది" అన్నాడు ఎనిమిది. "ఔను....ఔను" అంటూ వంత పాడారు మిగతావాళ్ళు.

"ఆల్ రైట్! నేనే వెళతాను" అన్నాడు అలీబాబా ఓ నిర్ణయానికి వస్తూ.

16

"ఆకాశ్! అలీబాబా వెళ్ళి, ఒకటి కాదు. రెండు కాదు మొత్తం మూడు గంటలు గడిచాయి. నాకేదో అనుమానంగా వుంది. ఆయన ఇంకా యెందుకు తిరిగి రాలేదంటావ్?" అడిగింది మర్జినా.

"నాకేం తెలుసు?" అన్నాడు ఆకాశ్ మొహం చిట్లిస్తూ.

"నువ్వు మర్యాదగా నోరు విప్పవు. నెంబర్ వన్! చిత్రహింసలు పెట్టే పనిముట్లు ఇలా తీసుకురా! కనీసం వాటిని చూసైనా ఇతని జ్ఞాపకశక్తి జాగృతమౌతుందేమో చూదాం!"

నెంబర్ వన్ లోపలికెళ్ళి, చిత్ర విచిత్రమైన వస్తువులతో తిరిగి వచ్చాడు.

ఆకాశ్ నవ్వాడు చిన్నగా. "మీ అంచనా కరక్టే! వాటిని చూడగానే ఇప్పుడు జ్ఞాపకం వచ్చేసింది నాకు.

పాపం, అలీబాబా అక్కడ యెటువంటి దయనీయ పరిస్థితిలో ఇరుక్కున్నాడో!"

"దయనీయ పరిస్థితా!" నెంబర్ వన్ కంఠంలో ఆందోళన.

"ఔను. మొదటి బీరువా తెరిచి, అందులో ప్రవేశించి, రెండో బీరువా తాళం మీద చెయ్యివేసిన మరుక్షణం మొదటి బీరువా తలుపు మూసుకు పోతుంది. ఆ సంగతి చెప్పడం మరిచాను."

"అందులో సమస్య ఏముంది? ఆ తలుపు తెరుచుకుని బైటికి రావచ్చు కదా!" అంది మార్జీనా.

"అసంభవం! అది యెట్టి పరిస్థితిలోనూ తెరుచుకునే తలుపు కాదు!"

"అంటే!?"

"ఏ పద్ధతిలో అయితే మీ గుహా ద్వారం తెరుచుకుంటుందో అలాగే దానిముందు నిల్చుని మూడుసార్లు తెరుచుకో....సుమ్....సుమ్ అనాలి!"

"అంతేనా! అదేమంత పెద్ద సమస్యకాదు. నెంబర్ వన్ నువ్వెళ్ళి అలీబాబాను బంధవిముక్తుణ్ని చేసుకురా!" అంది మార్జీనా తేలిగ్గా నిట్టూరుస్తూ.

పకపక నవ్వాడు ఆకాశ్!

"ఏమిటా వెధవ నవ్వు?" ఉరిమి చూశాడు నెంబర్ వన్.

"అబ్బాయ్! మీ గుహాద్వారం తెరుచుకోడానికి యెలాగైతే అందరి కంఠాలూ కంప్యూటర్లో పొందుపర్చి వున్నాయో, ఆ బీరువా తలుపు తెర్చుకోడానికీ ఒక్కడి కంఠమే పొందుపర్చి వుంది. నేను తప్ప మరెవ్వరూ గొంతు చించుకున్నా అది తెరుచుకోదు! వేలిముద్రల్లాగే

ప్రపంచంలోని యే ఇద్దరి కంఠాలూ, ఒకే ఫ్రీక్వెన్సీని కలిగి వుండవు!"

"ఐతే, వెంటనే టేప్ రికార్డర్ తెచ్చి. వీడి కంఠాన్ని రికార్డుచేసి తీసికెళ్ళండి."

"ఆ ప్రయత్నం కూడా వ్యర్థమే అవుతుంది మేడమ్! యెందుకంటే, సృష్టి సహజమైన శబ్దతరంగాలకూ, యంత్రాల ద్వారా టేప్ చేసిన తరంగాలకూ చాలా తేడా వుంటుంది. ఫ్రీక్వెన్సీ సరిగ్గా కలవదు. స్వయంగా నేనే బీరువాముందు నిల్చుని పలికితే తప్ప ఆ బీరువా తెరుచుకోదు."

"ఆక్సిజన్ అయిపోయి, అలీబాబా అందులో చూపి రాడక చావకముందే వీణ్ణక్కడికి తీసుకువెళ్ళడం మంచిది. ఆరుగురు ఆయుధాలతో రండి మా వెంట. మిగతావారు వీడి తల్లినీ. చెల్లినీ కాస్తూ ఇక్కడే వుండండి" అన్నాడు నెంబర్ వన్ ఆందోళనగా.

మరుక్షణం మోటర్ గారేజ్ లా ఉపయోగించే గుహ లోంచి పెద్ద వ్యాన్ బైటికితీశారు. ఆరుగురు సాయుధులతో, ఆకాశ్ తో వెంటనే అందులో యెక్కారు నెంబర్ వన్, ఎర్జినా!

17

ఆకాశ్ ఇంటిముందు వ్యాన్ ఆగగానే. బిలబిల దిగి, అతన్ని తోసుకుంటూ లోనికి నడిచారందరూ.

"ఎక్కడ ఆ బీరువా?" అడిగాడు నెంబర్ వన్.

"పడగ్గదిలో!" అంటూ వాళ్ళను అటు తీసికెళ్ళాడు ఆకాశ్.

మూసి వున్న పడగ్గది తలుపుల్ని భళ్ళున తెరిచాడు నెంబర్ వన్. అంతే! పక్కన పిడుగులు పడ్డట్టు ఆదిరి

పడ్డారందరూ! అలీబాబా చేతులు వెనక్కి విరిచి కట్టి బంధించబడున్నాడు సోఫాలో!! అతని చుట్టూ నలుగు రైదుగురు పోలీసాఫీసర్లు నిల్చునున్నారు.

పరిస్థితిని అర్థం చేసుకుని, ఆయుధాలు యెక్కుపెట్టే లోపలే, పక్క గదిలోంచి అనేకమంది పోలీసులు ఈగల్లా చుట్టుముట్టి వారి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

"ఎత్తులకు పై యెత్తులు యెలా వెయ్యబడతాయో ఇప్పుడు తెలిసిందా మీకు? ఇంతమంది పోలీసులు ఇక్కడెలా వున్నారా అని ఆశ్చర్యపోతున్నారు కదూ? నా చేతికున్న ఈ గడియారం మామూలు గడియారంకాదు. శక్తివంతమైన ట్రాన్స్మిటర్! స్థావరంలో యెప్పుడైతే నామీదా, నావారిమీద దౌర్జన్యం ప్రారంభించారో ఆ మాటలన్నీ, ఈ గడియారం ద్వారా పోలీస్ హెడ్ క్వార్టర్స్ చేరుకున్నాయి.

అలీబాబా ఇక్కడికి రాకముందే పోలీసులు వచ్చి, సిద్ధంగా కూర్చున్నారు.... ఇందాక నేను మీతో చెప్పిన బీరువా భాగోతమంతా కట్టి బూటకం! ఆ విధంగా మిమ్మల్ని కూడా ఇక్కడికి చేర్చాలని వేసిన ఎత్తు! అందుకు అయ్యారు మీరు చిత్తు!!

సదా ముసుగుల్లో వుండే మిమ్మల్ని. ప్రత్యక్షంగా చూసి తరించాలని ఎన్నాళ్ళనించో ఆశపడుతున్న నాకు, ఈ రోజు తీరబోతోంది ఆ కోరిక" అంటూ అలీబాబాను సమీపించి, మొహంమీది ముసుగు లాగాడు ఆకాశ్.

అంతే! దిగ్భ్రాంతిలో ఆకాశ్ బుర్ర తిరిగిపోయింది. "కిరణ్! నువ్వా!!" అన్నాడు.

ఎరుపెక్కిన కళ్ళతో, గాయపడ్డ పాములా బుస

కొట్టాడు జ్యోతి అన్న కిరణ్.

"ముఠా నాయకుడు మీరేనని కలలోకూడా ఊహించలేదు నేను. మందులు తయారుచేసే మీ లాబొరేటరీలో అక్రమంగా కొన్ని మత్తుపదార్థాలు తయారై, మామూలు కేప్‌సూల్స్‌లో నింపబడి, దేశం నలుమూలలకూ సప్లై అవుతున్నట్టు ప్రభుత్వానికి అనుమానం రాగా నే, సి.బి.ఐ. ద్వారా రహస్య విచారణ జరిపించాలని నన్ను నియమించారు.

అదృష్టవశాత్తూ అప్పుడే డ్రైవర్ కావాలని మీరు పత్రికల్లో ప్రకటించేసరికి ఆ అవకాశాన్ని వదులుకోకుండా అప్లై చేశాను. అదృష్టం ఇంకా కలిసివచ్చి, మీ చెల్లాయి జ్యోతి నా సహాధ్యాయినే కావడంతో ఏకంగా మీ లాబొరేటరీలోనే ఉద్యోగం దొరికింది నాకు.

దాంతో, ప్రభుత్వ అనుమానం నిజమేనని పసిగట్టగలిగాను. అంతలో, జ్యోతి జీవితంనించి వేరుచెయ్యాలని మీరు నన్ను హత్యా నేరంలో ఇరికించగానే ప్రభుత్వానికి మరో ఉపాయం తట్టింది.

పనిలో పనిగా అలీబాబా నలభై దొంగల కేసుకూడా నాకే అప్పగించి, జైల్లో వున్న భగీరథ్ ద్వారా మీ వరకూ చేరే పథకం రూపొందించారు. ఆ విధంగా మీ చలవతో నేను మృత్యు ద్వీపానికిచేరి, బాల్యంనించీ గుండెలో భగభగ మండే అగ్నిజ్వాలను చల్లార్చుకుని, తిరిగి రాగలిగాను.

చేసిన ఘాతుకాలకూ, అకృత్యాలకూ మీకు మరణ శిక్షలు పడటం, మీకిష్టం వున్నా, లేకున్నా మీ చెల్లెలితో నా పెళ్ళి జరగడం తరవాతి తతంగం! ముందు

మీ స్థావరంలో వున్న నా తల్లినీ, చెల్లాయినీ విడిపించుకు రావాలి" అంటూ పోలీసాఫీసర్ల వైపు తిరిగి.

"వీళ్ళను హెడ్ క్వార్టర్స్‌కు తీసికెళ్ళండి. మిగతా సిబ్బందితో నేను వ్యాన్‌లో వీళ్ళ స్థావరానికెళ్తాను. వ్యాన్ని చూసి, వీళ్ళే వచ్చారనుకుని, అజాగ్రత్తగా వుంటారు వాళ్ళు. ఆ భ్రమలో నే హఠాత్తుగా దాడిచేసి అందర్నీ లొంగదీసుకోవచ్చు!" అంటూ సిబ్బందితో గబగబ బైటికి నడిచాడు ఆకాశ్.

—:అ యి పో యి ం ది:—